



Truth of News

PRGI Reg No: APTEL/26/A4782

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 01 | సంచిక : 359 | ఆదివారం 19 జూలై 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



## బాణాసంచా పరిశ్రమలో పేలుడు

- 8 మంది మృతి- పలువురికి తీవ్రగాయాలు
- లైసెన్స్ రద్దయినా కొనసాగిన ఫ్యాక్టరీ
- గుజరాత్ రాష్ట్రంలో ఇలాంటి ఘోరాలెన్నో..


అహ్మదాబాద్ - సూర్య వాస్తవం

గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరంలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. రామోల్ ప్రాంతంలోని ఆర్ఏఎఫ్ (ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్) శిబిరం వెనుక మెహమద్‌పురాలో నడుస్తున్న అక్రమ బాణాసంచా ఫ్యాక్టరీలో మంటలు చెలరేగడంతో ఐదుగురు సజీవదహనమయ్యారు. మరో తొమ్మిది మంది తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి, గుజరాత్ సీఎం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, శనివారం మధ్యాహ్నం మూడున్నర గంటల

- మిగతా 2లో..

## 'విక్రమ్-1"రాకెట్ ప్రయోగం విజయవంతం

- భారతదేశపు తొలి ప్రైవేట్ ఆర్బిటాల్ రాకెట్‌గా రికార్డు
- స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ అభివృద్ధి చేసిన"విక్రమ్-1"
- నాలుగు ఉపగ్రహాలతో పాటు పలు పేలోడ్లను నింగిలోకి మోసుకెళ్లిన రాకెట్
- పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో స్టార్టప్ సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన రాకెట్ ప్రయోగం
-కుమారుడు దేవాన్ష్‌తో కలిసి ప్రయోగాన్ని వీక్షించిన మంత్రి నారా లోకేశ్





దొరవారిసత్రం - సూర్య వాస్తవం :

భారత అంతరిక్ష రంగంలో సరికొత్త చరిత్ర లిఖిస్తూ,తొలి ప్రైవేట్ ఆర్బిటాల్ రాకెట్ "విక్రమ్-1"విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో, హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్

- మిగతా 2లో..

## విక్రమ్-1 విజయంపై స్కైరూట్‌కు మోదీ ఫోన్

- "భారత్‌ను గర్వపడేలా చేశారు"అంటూ ప్రధాని మోదీ ప్రశంసలు
- యువతపై తన నమ్మకం నిజమైందన్న ప్రధాని మంత్రి మోదీ
- విక్రమ్-1తో అంతరిక్షంలోకి మోదీ రాసిన "వందేమాతరం"సందేశం
- "ఆగమన్"పేరుతో చేపట్టిన ఈ మిషన్ స్కైరూట్ ప్రయాణానికి ఆరంభం: ప్రధాని



దొరవారిసత్రం - సూర్య వాస్తవం :

భారత తొలి ప్రైవేట్ రాకెట్ విక్రమ్-1 ప్రయోగం విజయవంతమైన వెంటనే ప్రధాని నరేంద్ర మోదీ స్కైరూట్ బృందానికి ఫోన్ చేసి అభినందించారు. సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో సంబరాలు జరుగుతున్న సమయంలో వచ్చిన ఈ కాల్‌లో యువ శాస్త్రవేత్తల కృషిని ప్రధాని ప్రశంసించారు. స్కైరూట్ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు పవన్ కుమార్‌తో

- మిగతా 3లో..

## 2024లో రాజకీయ చెత్తను ప్రజలే శుభ్రం చేశారు

- గుడివాడలో చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా రూ.15,274 కోట్ల పట్టణాభివృద్ధి పనులకు గుడివాడ నుంచి శ్రీకారం
- బూతులు తిట్టిన వారి నోళ్లను ప్రజలు తమ ఓట్లతో కడిగేశారన్న చంద్రబాబు
- అక్టోబర్ 2 నాటికి ఏపీని చెత్త రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రకటన
- భావ ప్రకటనా స్వేచ్ఛ పేరుతో అసభ్య పోస్టులను సహించేది లేదని హెచ్చరిక
- ఈ నెల 22 నుంచి "తల్లికి వందనం" కింద తల్లుల ఖాతాల్లో నిధులు జమ




గుడివాడ- సూర్య వాస్తవం

పరిశుభ్రమైన, సంపన్నమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని, 2024 ఎన్నికల్లో రాష్ట్రంలోని రాజకీయ చెత్తను ప్రజలే శుభ్రం చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. బూతులు తిట్టిన వారి నోళ్లను ప్రజలు తమ ఓట్లతో కడిగేశారని ఘాటుగా వ్యాఖ్యానించారు. కృష్ణా జిల్లా గుడివాడలో శనివారం జరిగిన 18వ స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని 120 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో రూ.15,274 కోట్ల విలువైన ప్రజారోగ్య, మున్సిపల్ ఇంజినీరింగ్ పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. అక్టోబర్ 2వ తేదీ నాటికి రాష్ట్రాన్ని కాలుష్య రహిత, చెత్త రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

### స్వచ్ఛ రాజకీయాల కోసమే ఎన్టీఆర్ పార్టీ స్థాపన

దివంగత ఎన్టీఆర్ తొలిసారి ప్రజాక్షేత్రంలో నిలిచిన గుడివాడ నుంచే

- మిగతా 2లో..



## మేకెదాటు ప్రాజెక్టు తమిళనాడుకు సహాయపడుతుంది

- ముఖ్యమంత్రి డీకే శివకుమార్

బెంగళూరు- సూర్య వాస్తవం

రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితి, దానిని ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు ఆదివారం అత్యవసర మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి డీకే శివకుమార్ శనివారం తెలిపారు. ప్రస్తుతానికి డ్యామ్‌లలోని నీటిని కేవలం తాగునీటి అవసరాలకే కేటాయిస్తున్నామని ఆయన అన్నారు. జలాశయాల్లోని నీటి నిల్వ స్థాయిని బట్టి సరస్సులకు నీటిని విడుదల చేస్తారు. పొరుగు రాష్ట్రాలు, ముఖ్యంగా తమిళనాడు, కావేరీ నదీ జలాలను విడుదల చేయాలని ఒత్తిడి చేస్తున్నాయని సీఎం శివకుమార్ అన్నారు. "నేను ఆదివారం అత్యవసర

- మిగతా 2లో..



## వాంగ్‌చుక్ అరెస్టు

- సామాజిక కార్యకర్తను ఎత్తుకెళ్లిన పోలీసులు
- అడ్డొచ్చిన సీజేపీ కార్యకర్తలనూ నెట్టివేసిన వైనం
- దేశ రాజధానిలో పోలీసుల క్రూరత్వం
- జంతర్ మంతర్ వద్దకు తరలి వచ్చిన వేలాది మంది
- అభిజీత్ దీప్కే నిరవధిక నిరాహార దీక్ష
- ఆయనపై సంఘ్ పరివార్ మద్దతుదారుడు సిరాతో దాడి
- ఎస్ఎఫ్ఐ నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభం
- పోలీసుల చర్యను ఖండించిన సీపీఐ(ఎం) నేతలు

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

నీట్ ప్రశ్నా పత్రం లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష?ను ఢిల్లీ పోలీసులు భగ్నం చేశారు. శనివారం తెల్లవారుజామునే వందలాది మంది పోలీసులు మఫ్టీలో జంతర్‌మంతర్ వద్దకు చేరుకుని దీక్షా శిబిరంపై దాడికి పాల్పడ్డారు. సీజేపీ కార్యకర్తలు అడ్డుకున్నా వారిని పక్కకు నెట్టి సోనమ్ వాంగ్‌చుక్‌ను బలవంతంగా తెల్లటి వస్త్రం కప్పి ఎత్తుకెళ్లారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రాథమిక అవసరాల కోసం గదిలోకి వెళ్లిన సమయంలో పోలీసులు ఈ చర్యకు పాల్పడ్డారు.

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి



## మహిళను వివస్త్రను చేసి దాడికి పాల్పడిన ఘటన మానవత్వానికే మచ్చ

- గుంటూరులో మహిళపై టీడీపీ నేత దాడి ఘటనపై జగన్ ఆగ్రహం
- బుధవారం ఘటన జరిగితే మూడు రోజులు కప్పిపుచ్చారని ఆరోపణ
- ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించలేదని తీవ్ర విమర్శలు
- ఇదేనా సుపరిపాలన, మహిళా భద్రత అంటూ సర్కారుకు ప్రశ్నలు
- మహిళల ఆగ్రహం ప్రభుత్వానికి బుద్ధి చెబుతుందని హెచ్చరిక


గుంటూరు- సూర్య వాస్తవం

గుంటూరులో ఒక మహిళను వివస్త్రను చేసి, టీడీపీ నాయకుడు దాడికి పాల్పడిన ఘటన మానవత్వానికే మచ్చ అని, రాష్ట్రంలో శాంతిభద్రతల నిర్వహణ ఎంత ఘోరంగా విఫలమైందో

- మిగతా 3లో..

## అంతర్జాతీయ ప్రమాణాలతో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ

- కొణిజర్ల మండలం గుబ్బగుర్తిలో గోద్రెజ్ నిర్మాణం
- రూ. 300 కోట్లతో రాష్ట్రంలోనే తొలి 'ప్రయివేట్' కాంప్లెక్స్
- 700 మందికి ప్రత్యక్ష ఉపాధి.. మూడు జిల్లాల్లోని 21 మండలాల రైతులకు సేవలు



ఖమ్మం - సూర్య వాస్తవం

ఖమ్మం జిల్లాలో రూ. 300 కోట్ల భారీ పెట్టుబడితో అత్యాధునిక సాంకేతికతతో రాష్ట్రంలోనే తొలి ప్రయివేట్ సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ (సమీకృత ఫ్యాక్టరీ) కొణిజర్ల మండలం గుబ్బగుర్తిలో ఏర్పాటు కానుంది. ఈ ప్రాజెక్ట్ తుది దశకు చేరి ప్రారంభానికి సిద్ధంగా ఉంది. దీనిని ఈనెల 20వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించనున్నారు. గోద్రెజ్ అగ్రోవెట్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఈ ప్లాంట్ ద్వారా సుమారు 700 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. ఆయిల్ పామ్ ప్రాసెసింగ్‌తో పాటు నాణ్యమైన విత్తనోత్పత్తి, పరిశోధన, రహదారులు ఈ ప్రాజెక్ట్‌లో రూపు దిద్దుకుంటాయి. జిల్లాలో ఆయిల్ పామ్ సాగును విస్తరించడంతో పాటు, స్థానిక రైతులకు అవసరమైన సదుపాయాలను అందించడానికి ఈ ఫ్యాక్టరీ దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ దివాకర్ తెలిపారు.

### ప్రాజెక్టులో భాగంగా..

ప్రాజెక్టు విభాగాల్లో భాగంగా నాణ్యమైన పామాయిల్ మొక్కలను పెంచి రైతులకు అందిస్తారు. అత్యాధునిక సాంకేతికతతో క్రూడ్ పామాయిల్ ఉత్పత్తి చేస్తారు. నాణ్యమైన విత్తనాలు, మొక్కల కోసం రీసెర్చ్ సెంటర్‌ను నెలకొల్పుతున్నారు. భూసారం, ఆయిల్ నాణ్యతపై పరిశోధనలు చేసి రైతులకు సాంకేతిక సలహాలు

- మిగతా 2లో..

# మేకెదాటు ప్రాజెక్టు తమిళనాడుకు సహాయపడుతుంది

(మొదటిపేజీ తరువాయి)

కేబినెట్ సమావేశం ఏర్పాటు చేశాను. ఈ కేబినెట్ సమావేశాన్ని గురువారమే నిర్వహించాలని మేము ప్రణాళిక వేసుకున్నాము. కానీ నేను ఢిల్లీ వెళ్లడం వల్ల అది సాధ్యపడలేదు. మనం ప్రత్యేకంగా కరువు పరిస్థితిపై చర్చించాల్సి ఉంది. ఉదయం వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా డిప్యూటీ కమిషనర్లు, జిల్లా పంచాయత్ సీఈఓలు, అన్ని జిల్లాల అధికారులతో సమావేశం ఉంది," అని ముఖ్యమంత్రి అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ, "మేము ఇప్పటికే కరువు పరిస్థితి, అమలు చేయగల ప్రణాళికలు, చర్యల గురించి సమాచారం తీసుకున్నాము. కరువు సమయంలో ఆకలితో అలమటించే వారి సంఖ్య పెరిగింది. ఏం పని చేయాలో చూడాలి, కానీ ఆకలితో అలమటించే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. ఆ తర్వాత కేంద్రంతో చర్చలు జరుపుతాము," అని ముఖ్యమంత్రి అన్నారు. కేంద్రానికి రాసిన లేఖ గురించి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఇలా అన్నారు, "ఇంకా ఏమీ లేదు. లేఖ రాసిన తర్వాత వారు సమాధానం ఇవ్వరని నాకు తెలుసు. నేను ఇంకా సమాచారం పంపాల్సి ఉంది. ఎక్కడ, ఎంత వర్షం కురిసిందనే సమాచారం నా దగ్గర ఉంది." నీటిని విడుదల చేయాలని తమిళనాడు ప్రజల నుంచి చాలా ఒత్తిడి ఉంది. తుంగభద్రలో కూడా ఒత్తిడి ఉంది. డ్యామ్ నిండితే మీకు నీరు ఇస్తాము. ఇప్పుడు మా దగ్గర నీరు లేకపోతే ఇస్తాము అని సీఎం డీకే శివకుమార్ అన్నారు. కావేరీ నదీ జలాల సమస్యపై నేను వ్యాఖ్యానించను. దీనిపై చాలా వివాదం ఉంది. నేను దానిపై చర్చించను. నేను ఢిల్లీకి వెళ్తాను. ఇది మా హక్కు, సుప్రీంకోర్టు కూడా ఇదే చెప్పింది. మేము మా పని చేసుకుంటాం. మేకెదాటు ప్రాజెక్టు తమిళనాడుకు సహాయపడుతుంది, అని ఆయన అన్నారు.

# బాణాసంచా పరిశ్రమలో పేలుడు

(మొదటిపేజీ తరువాయి)



సమయంలో ఫ్యాక్టరీ లోపల భారీ శబ్దంతో పేలుడు సంభవించి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. పేలుడు సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అగ్నిప్రమాదం జరిగిన వెంటనే సమీపంలోని వస్త్రాల్ ఆర్ఏఎఫ్ శిబిరానికి చెందిన జవాన్లు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. స్థానిక పోలీసులు, అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అగ్నిమాపక సిబ్బంది కూడా వెంటనే చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. క్షతగాత్రులను సమీప ఆస్పత్రులకు తరలించారు. గాయపడ్డ వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండ టంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తు న్నారు. గాయపడిన వారిలో ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులతో పాటు చిన్నా రులు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. బాధితుల పూర్తి వివరాలు, వారి కుటుంబ సభ్యుల సమాచారం సేకరించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

**లైసెన్స్ రద్దయినా కొనసాగిన ఫ్యాక్టరీ**

సెక్టార్-2 జాయింట్ పోలీస్ కమిషనర్ జయపాల్ సింగ్ రాథోడ్ తెలిపిన వివరాల ప్రకారం, మెహుల్ దోడియా అనే వ్యక్తి ఈ బాణాసంచా ఫ్యాక్టరీని నిర్వహిస్తున్నాడు. గతంలోనే అతని లైసెన్స్ రద్దు అయినప్పటికీ అక్రమంగా ఫ్యాక్టరీ కొనసాగుతున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ ఘటనపై రామోల్ పోలీస్ స్టేషన్‌లో హత్యతో పాటు పేలుడు పదార్థాల చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు.

**ప్రధాని, సీఎం దిగ్భ్రాంతి**

ఈ దుర్ఘటనపై ప్రధాని మోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధాని జాతీయ సహాయ నిధి నుంచి రూ.2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గుజరాత్ ముఖ్యమంత్రి కూడా ఈ ఘటనపై సంతాపం వ్యక్తం చేస్తూ, బాధితులకు అవసరమైన అన్ని వైద్య, సహాయక చర్యలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అగ్నిప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# అంతర్జాతీయ ప్రమాణాలతో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ

(మొదటిపేజీ తరువాయి)

ఇస్తారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 113.5 ఎకరాల భూమిని కేటాయించారు. అక్కడ ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ మిల్లు, నర్సరీ, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్, అధునాతన సీడ్ గార్డెన్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో రెండు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలు నిర్మాణంలో ఉన్నాయి. ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో వేంసూరు మండలం కల్లూరుగూడెంలో రూ.250 కోట్లతో ఒక ఫ్యాక్టరీ నిర్మిస్తుండగా, గోద్రెజ్ అగ్రోవెట్ ఆధ్వర్యంలో గుబ్బగుర్తిలో మరో ఫ్యాక్టరీ నిర్మిస్తున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం పనిచేస్తున్న ఆయిల్ పామ్ మిల్లులతో పోలిస్తే పూర్తి ఆటోమేషన్‌తో ఇది రూపొందుతోంది. రోజుకు 300 టన్నులు, నెలకు సుమారు 9 వేల టన్నుల క్రూడ్ పామ్ ఆయిల్ ఉత్పత్తి చేసేలా దీన్ని రూపొందించారు. భవిష్యత్తులో అవసరాన్ని బట్టి గంటకు 60 టన్నుల సామర్థ్యానికి విస్తరించేలా ప్లాంట్ నిర్మిస్తున్నారు.విద్యుత్ వ్యయంతో పాటు పర్యావరణహిత ఉత్పత్తి విధానం దీని ద్వారా అమల్లోకి రానుంది.

**మూడు జిల్లాల్లో 21 మండలాల రైతులకు సేవలు**

రైతులకు సమగ్ర సేవలు అందించేందుకు గుబ్బగుర్తిలో 'సమాధాన్ వన్ స్టాప్ సొల్యూషన్ సెంటర్' ఏర్పాటు చేశారు. ఫ్యాక్టరీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత జిల్లాలోని ఆరు మండలాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని నాలుగు మండలాలు, సంగారెడ్డి జిల్లాలోని ఆయిల్ పామ్ సాగు ప్రాంతాలు కలిపి మొత్తం 21 మండలాల రైతులకు సేవలు అందనున్నాయి. 700 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇప్పటికే నిర్మాణ పనులు తుది దశకు చేరుకోగా, ఈ నెల 20 నాటికి అన్ని పనులు పూర్తి చేసి ఫ్యాక్టరీని ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆఫీసర్లు సన్నాహాలు చేస్తున్నారు.

# 'విక్రమ్-1"రాకెట్ ప్రయోగం విజయవంతం

(మొదటిపేజీ తరువాయి)

సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన ఈ రాకెట్ ప్రయోగం.అంతరిక్ష వాణిజ్యంలో దేశానికి కొత్త ద్వారాలు తెరిచింది.తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) వేదికగా జరిగిన ఈ చరిత్రాత్మక ప్రయోగాన్ని రాష్ట్ర ఐటీ,విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన కుమారుడు దేవాన్ష్‌తో కలిసి వీక్షించారు"మిషన్ ఆగమన్"పేరుతో చేపట్టిన ఈ ప్రయోగం మధ్యాహ్నం 12.05 గంటలకు జరిగింది.షార్‌లోని ఒకటవ ప్రయోగ వేదిక నుంచి విక్రమ్-1 రాకెట్ నిప్పులు చిమ్ముతూ ఆకాశంలోకి దూసుకెళ్లింది.ఈ చారిత్రక ఘట్టాన్ని చూసేందుకు షార్‌లోని లాంచ్ వ్యూ గ్యాలరీకి మంత్రి లోకేశ్, దేవాన్ష్ కూడా విచ్చేశారు.రాకెట్ విజయవంతంగా గమ్యాన్ని చేరుకోవడంతో వారు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు చేసుకున్నారు."విక్రమ్-1 ప్రత్యేకతలు"

భారత ప్రైవేట్ అంతరిక్ష రంగ ప్రస్థానంలో "విక్రమ్-1"ఒక కీలక మైలురాయిగా నిలిచింది.ఈ రాకెట్ సుమారు 350 కిలోల బరువున్న పేలోడ్‌ను భూమికి 450 కిలోమీటర్ల ఎత్తులోని నిమ్న కక్ష్యలోకి ప్రవేశపెట్టగల సామర్థ్యం కలిగి ఉంది.స్కైరూట్ సంస్థ సొంతంగా అభివృద్ధి చేసిన ప్రొపల్షన్ సిస్టమ్స్,3డీ ప్రింటెడ్ ఇంజన్లు,ఘన ఇంధన రాకెట్ బూస్టర్లను ఇందులో ఉపయోగించారు.అంతరిక్ష ప్రయోగాల వ్యయాన్ని గణనీయంగా తగ్గించడంతో పాటు ఉపగ్రహాలను వేగంగా,సమర్థవంతంగా కక్ష్యలోకి చేర్చడమే లక్ష్యంగా విక్రమ్-1ను రూపొందించినట్లు స్కైరూట్ తెలిపింది.ఈ తొలి ప్రయోగంలో విక్రమ్-1 రాకెట్ నాలుగు చిన్న ఉపగ్రహాలను రోదసిలోకి తీసుకెళ్లింది.వీటిలో గ్రహాస్పేస్,కాస్మోసర్వ్,డీక్యూబ్డ్ సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమాన్‌స్ట్రేషన్ పేలోడ్లు ఉన్నాయి.వీటితో పాటు స్కైరూట్ సొంత ఉపగ్రహం "స్కోప్"(స్కోప్) కూడా ఉంది.అంతేకాకుండా కాస్మోస్ డైమండ్స్‌కు చెందిన"కాస్మిక్ బ్లూమ్"అనే ఒక కళాకృతిని,మరో మైక్రో-ఆర్ట్ పీస్‌ను కూడా ఈ రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపడం విశేషం.ఈ



కార్యక్రమంలో ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్, స్కైరూట్ ఏరోస్పేస్ సహ వ్యవస్థాపకుడు,సీఈవో పవన్ కుమార్ చందన కూడా పాల్గొన్నారు.ఈ ప్రయోగం దేశంలో డీప్ టెక్ ఆశయాలకు,స్టార్టప్ పర్యావరణ వ్యవస్థకు గొప్ప ఊతాన్ని ఇస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.మొత్తం మీద "మిషన్ ఆగమన్"విజయం.ప్రభుత్వ రంగ సంస్థ ఇస్రోకు తోడుగా ప్రైవేట్ కంపెనీలు కూడా కీలక పాత్ర పోషించే నూతన శకానికి నాంది పలికింది.

# 2024లో రాజకీయ చెత్తను ప్రజలే శుభ్రం చేశారు



(మొదటిపేజీ తరువాయి)

స్వచ్ఛ రాజకీయాలకు పునాది పడిందని చంద్రబాబు గుర్తుచేశారు. స్వచ్ఛమైన రాజకీయాలు, స్వచ్ఛమైన ప్రజాప్రతినిధులు, తెలుగువారి ఆత్మగౌరవం అనే లక్ష్యాలతోనే ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని తెలిపారు. గతంలో ఉన్న స్వార్థ రాజకీయాలను పక్కనపెట్టి అభివృద్ధి, సంక్షేమానికి ఆయన శ్రీకారం చుట్టారని అన్నారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి, సంపద సృష్టి లక్ష్యంగా పనిచేస్తోందని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు. పరిశుభ్రత అంటే కేవలం రోడ్లు ఊడ్చడం కాదని, పర్యావరణాన్ని, ప్రజారోగ్యాన్ని కాపాడటమే అసలు లక్ష్యమని వివరించారు.

**అక్టోబర్ 2 నాటికి చెత్త రహిత రాష్ట్రం**

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 140 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయిందని, దానిని తొలగించి ఇప్పుడు స్వచ్ఛ పథం, ఆపరేషన్ క్లీన్ స్వీప్ వంటి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని శుభ్రం చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. అక్టోబర్ 2 నాటికి రాష్ట్రాన్ని చెత్త రహితంగా మారుస్తామని ప్రకటించారు. దీనికోసం రూ.528 కోట్లతో వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లు, చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే 8 ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇంటింటికీ చెత్త సేకరణ కోసం 126 ఎలక్ట్రిక్ ఆటోలను ప్రారంభించామని, త్వరలో మరో 1104 ఇ-ఆటోలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి నుంచే తడి, పొడి చెత్తను వేరుచేయాలని, 'నెట్ జీరో' వ్యర్థాల విధానాన్ని అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

**తప్పు ఎవరు చేసినా ఉపేక్షించం**

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని, ప్రజలు సంతోషంగా జీవించే పరిస్థితి లేకపోయిందని చంద్రబాబు విమర్శించారు. రాజకీయాల్లో క్రిమినల్ ధోరణులు, కుట్రలు, సోషల్ మీడియాలో అసభ్య పోస్టులతో ప్రజలను వేధిస్తున్నారని ఆరోపించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుటుంబ సభ్యులపై అసభ్య పోస్టులు పెట్టి, ప్రశ్నిస్తే భావ ప్రకటనా స్వేచ్ఛ అనడం దారుణమన్నారు.

ప్రజల జీవితాలకు ఆటంకం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవడానికి వీల్లేదని, తప్పు చేసిన వ్యక్తి ఏ పార్టీకి చెందిన వారైనా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గుంటూరులో మహిళ పట్ల దురుసుగా ప్రవర్తించిన టీడీపీ కార్యకర్తను తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేసి అరెస్ట్ చేయించామని, శ్రీకాకుళం ఘటనలోనూ బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు.

**సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు**

తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రభుత్వం వద్ద డబ్బు లేకపోయినా, పేదల పక్షాన నిలిచే మనసుందని అన్నారు. ఈ నెల 22 నుంచి 24 మధ్య "తల్లికి వందనం" పథకం కింద 67.47 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.10,122 కోట్లు జమ చేయనున్నట్లు ప్రకటించారు. మరోవైపు, 12 ఏళ్ల క్రితం నీళ్లు లేక ఇబ్బంది పడిన కృష్ణా డెల్టాకు పట్టిసీమ ద్వారా 450 టీఎంసీల గోదావరి జలాలను అందించి రూ.50 వేల కోట్ల సంపద సృష్టించామని గుర్తుచేశారు. అక్వా రైతులకు యూనిట్‌కు రూ.1.50కే విద్యుత్ అందిస్తూ ఆదుకుంటున్నామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా గుడివాడ బస్టాండ్ అభివృద్ధికి అన్నే నరసింహారావు దంపతులు రూ.3 కోట్లు విరాళం ప్రకటించారు. సాయి శ్వేత అనే గృహిణి అమరావతి కోసం తన బంగారు గాజులను విరాళంగా ఇచ్చారు. వారిని ముఖ్యమంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పి.నారాయణ, కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్, ఎంపీ బాలశౌరి, స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తదితరులు పాల్గొన్నారు.

# వాంగ్‌చుక్ అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

అభిజీత్‌ను అదుపులోకి తీసుకున్నారు. వాంగ్‌చుక్‌ను ఎత్తుకెళ్లిన పోలీసులను అభిజీత్ ఆర్ఎస్ఎస్ గూండాలతో పోల్చారు. వాంగ్‌చుక్‌ను పోలీసులు కిడ్నాప్ చేశారని, తనను కొట్టారని ఆయన ఆరోపించారు. ఈ ఘటనతో జంతర్‌మంతర్ వద్దకు వేలాది మంది తరలివచ్చారు. సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ, పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. అరుణ్‌కుమార్, సీనియర్ నాయకురాలు బృందా కరత్, ఎంపీలు జాన్ బ్రిట్టాస్, వి. శివదాసన్, అఖిల భారత ప్రజాస్వామ్య మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి కనినికా ఘోష్, సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్, సీపీఐ నేతలు నారాయణ, రామకృష్ణ జంతర్ మంతర్‌కు చేరుకుని పోలీసుల చర్యలను ఖండించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ మీడియాతో మాట్లాడుతూ పర్యావరణ వేత్త సోనమ్ వాంగ్‌చుక్ పట్ల ఢిల్లీ పోలీసులు దారుణంగా వ్యవహరించారని విమర్శించారు. సఫ్దర్ జంగ్ ఆస్ప్రతిలో చికిత్స పొందుతున్న వాంగ్ చుక్ వద్దకు పోలీసులు అనుమతించటం లేదని అన్నారు. దీంతో ఆ ఆస్పత్రి డైరెక్టర్ కవిత రాణి శర్మతో మాట్లాడి వాంగ్‌చుక్ రిపోర్టులు పరిశీలించామని తెలిపారు. సోనమ్ వాంగ్ చుక్ ను బలవంతంగా ఎత్తుకు పోవటాన్ని వ్యతిరేకిస్తూ దేశంలోని వివిధ ప్రాంతాల్లో నిరసనలు జరిగాయి. వాంగ్‌చుక్ కుటుంబ సభ్యులను, వైద్యులను సంప్రదించకుండానే పోలీసులు ఈ చర్య తీసుకున్నారని ఆయన భార్య గీతాంజలి ఆంగ్మో అన్నారు. ప్రస్తుతం సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వాంగ్‌చుక్ పోటాషియం స్థాయి 2.9గా ఉందనీ, శుక్రవారం 4.3గా ఉన్నట్టు ఆమె చెప్పారు. దీనిపై అనుమానం ఉందని,




మరో ల్యాబ్‌లో పరీక్ష చేయడానికి వారు అనుమతించలేదని తెలిపారు.

**అభిజీత్ దీప్కే నిరవధిక నిరాహార దీక్ష**

సోనమ్ వాంగ్‌చుక్‌ను దీక్షశిబిరం నుంచి పోలీసులు ఎత్తుకెళ్లడంతో సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. ఆయన నిరసనకారులకు అభివాదం చేస్తుండగా, సంఘ్ పరివార్ మద్దతుదారుడు ఒకరు అభిజీత్‌పై సిరా చల్లారు. సోనమ్ వాంగ్‌చుక్‌తో కలిసి నిరాహార దీక్ష ప్రారంభించిన విద్యార్థి కార్యకర్తలు కూడా జంతర్ మంతర్ వద్ద ఆందోళన కొనసాగిస్తున్నారు.

**ఎస్ఎఫ్ఐ నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభం**


వాంగ్‌చుక్‌కు సంఘీభావంగా జంతర్ మంతర్ వద్ద ఉన్న 'క్రాంతి కార్నర్' వద్ద ఎస్ఎఫ్ఐ నిరాహార దీక్షను ప్రారంభించింది. అఖిల భారత అధ్యక్షుడు ఆదర్శ్ ఎం సాజీ, సంయుక్త కార్యదర్శి ఐషీ ఘోష్ నిరాహార దీక్షలో పాల్గొన్నారు. వాంగ్‌చుక్‌ను విడుదల చేసే వరకు తమ నిరాహార దీక్ష కొనసాగిస్తామని వారు ప్రకటించారు. విద్యా రంగంలో వైఫల్యానికి కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని, విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, ఎన్టీఏను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేశారు. వాంగ్‌చుక్‌కు సంఘీభావంగా దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ తన యూనిట్లకు పిలుపునిచ్చింది. "ఇది భారతదేశ భవిష్యత్తును కాపాడే పోరాటం. పోలీసులు ఎంత అణచివేయడానికి ప్రయత్నించినా మేము అంగుళం కూడా వెనక్కి తగ్గం. దేశవ్యాప్తంగా వందలాది క్రాంతి కార్నర్‌లను ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ నిర్ణయించింది. ఈ ప్రదేశాలలో నిరవధిక సమ్మె ప్రారంభించబడుతుంది. ఇతర విద్యార్థి, ప్రజా సంఘాలు కూడా ఇందులో చేరతాయని భావిస్తున్నాము." అని ఆదర్శ్ ఎం సాజి అన్నారు.

ఐషీ ఘోష్ మాట్లాడుతూ "జూలై 18 ఉదయం జరిగినది ఆమోదయోగ్యం కాదు. శాంతియుతంగా నిరాహార దీక్ష చేస్తూ, కనీసం కదలలేని స్థితిలో ఉన్న, నిశ్శబ్దంతో న్యాయం కోరుతున్న వ్యక్తిని అపహరించారు. ఒక్క వాంగ్‌చుక్‌ను అడ్డుకుంటే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ లక్షలాది మంది ముందుకు వస్తారు" అని అన్నారు.

సీజేపీ నేత సౌరవ్ దాస్ మాట్లాడుతూ ... హైకోర్టు ఆదేశాల ప్రకారం కేంద్ర ప్రభుత్వం సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలని మాత్రమే ఆదేశించిందని, ఆయనను ఎత్తుకెళ్లమని చెప్పలేదని అన్నారు. హైకోర్టు ఆదేశాలను ఢిల్లీ పోలీసులు ఉల్లంఘించారని విమర్శించారు. గత రోజులకు భిన్నంగా శనివారం ఉదయం నుంచే భారీ సంఖ్యలో పోలీసులు, కేంద్ర బలగాలను మోహరించారు. నిరసనను అణచివేసేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ శుక్రవారం సీనియర్ ఐపీఎస్ అధికారి అనురాగ్ కుమార్‌ను ఢిల్లీ పోలీస్ కమిషనర్‌గా నియమించింది. ఈ మార్పు వెనుక ప్రధాని మోడీ ఉన్నట్టు ఆప్ ఆరోపించింది. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం కావడానికి రెండ్రోజుల ముందే జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులు, యువత చేస్తున్న సీజేపీ ఆందోళన, వాంగ్‌చుక్ నిరాహార దీక్ష?ను అణచివేసేందుకు కేంద్రం కుట్రలకు దిగింది.

# కూటమికి టిక్కెట్ల సవాల్

విజయవాడ – సూర్యవాస్తవం



ఆంధ్రప్రదేశ్ రాజకీయం మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలు సమయం దగ్గర పడుతోంది. ఈ సారి ఎన్నికల బరిలో అధికార కూటమి ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాల్ ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కాదు.. ఆయా పార్టీల మధ్య సమన్వయమే. సార్వత్రిక ఎన్నికల్లో లభించిన క్లీన్ స్వీప్ విజయం తర్వాత, క్షేత్రస్థాయిలో కూటమి గ్రాఫ్ బలంగా ఉంది. వైసీపీ రక్షణాత్మక ధోరణిలో ఉండటంతో, తాము గెలుపు గుర్రాలమనే ధీమా కూటమి నేతల్లో అత్యధికంగా ఉంది. ఫలితంగా, అసలు పోటీ ప్రతిపక్షంతో కాదని, టిక్కెట్ల కోసం తమలో తామే పోటీ పడాల్సి ఉంటుందని కూటమి అగ్రనాయకత్వానికి ముందే అర్థమైంది. కింది స్థాయి నేతలంతా తామంటే తామే పోటీ చేస్తామని ఎగబడుతుండటంతో సీట్ల పంపకం, సమన్వయం అనేది ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది. ఈ అంతర్గత పోటీని, అసమ్మతిని ముందే పసిగట్టిన కూటమి పెద్దలు అప్రమత్తమయ్యారు. ఎక్కడికక్కడ మున్సిపల్ వార్డులు, ఎంపీటీసీ స్థానాల వారీగా ఏ పార్టీ ఏ స్థానంలో పోటీ చేయాలనే దానిపై ఓ స్పష్టత తెచ్చేందుకు తెరవెనుక ప్రత్యేక సమన్వయ సమావేశాలు నిర్వహించారు. గత ఎన్నికల ఓట్ల శాతం, స్థానిక బలాబలాలు , ఇరు పార్టీల నేతల అంగీకారం ఆధారంగా ఒక స్థూల ప్రణాళికను సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఈ చర్చలు ప్రాథమికంగా ఒక కొలిక్కి రావడంతోనే ప్రభుత్వం ఎన్నికల నిర్వహణ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. ఏ ఒక్క స్థానంలో కూడా ఓట్ల చీలిక రాకుండా, పరస్పరం సహకరించుకునేలా కింది స్థాయి క్యాడర్‌ను మానసికంగా సిద్ధం చేస్తున్నారు. మరోవైపు, జనసేన పార్టీలో ఈ ఎన్నికల కోసం ప్రత్యేకంగా గ్రౌండ్ వర్క్ నడుస్తోంది. పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ కూడా కూటమి సమన్వయంపై గట్టి సంకేతాలే ఇచ్చారు. కూటమి శ్రేణుల మధ్య ఐక్యత మిస్ కాకూడదని, సీట్ల సర్దుబాటులో ఒకరికొకరు గౌరవం ఇచ్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అంతేకాకుండా, గత ఐదేళ్లుగా పార్టీ కోసం నిలబడి, జెండా మోసి కష్టపడిన నిజమైన జనసైనికులకు ఈ స్థానిక ఎన్నికల్లో సముచిత స్థానం కల్పించేలా జనసేన అధిష్టానం ఇప్పటికే అంతర్గతంగా సమాచార సేరణ పూర్తి చేసింది. పార్టీ గెలిచే అవకాశాలు ఉన్న స్థానాల జాబితాను సిద్ధం చేసి, చంద్రబాబుతో సీట్ల సర్దుబాటు చర్చలకు పక్కా వ్యూహంతో సిద్ధమైంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వార్డుల స్థాయిలో గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉండటంతో, క్షేత్రస్థాయి నేతల్లో ఆశావహుల సంఖ్య వేలల్లో ఉంది. సీటు దక్కని పక్షంలో తిరుగుబాటు అభ్యర్థులుగా బరిలోకి దిగే ప్రమాదం కూడా లేకపోలేదు. అలాంటి చోట్ల ఆశావాహులను బుజ్జగించి, కూటమి క్రమశిక్షణను కాపాడటంలోనే మూడు పార్టీల సమన్వయకర్తల అసలు పరీక్ష దాగి ఉంది. ఏదేమైనా, ఈ లోకల్ బాడీ ఎన్నికలను విజయవంతంగా ముగించి తమ ఆధిపత్యాన్ని నిరూపించుకోవాలని కూటమి భావిస్తుండటంతో, సీట్ల పంపకాల వ్యూహం కీలకం కానుంది.

### 15 తర్వాత మున్సిపల్ ఎన్నికలు

ధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై తీవ్ర కసరత్తు ప్రారంభించింది. రాష్ట్రంలో ఐదేళ్ల కాలపరిమితి ముగిసిన స్థానిక సంస్థలకు వీలైనంత త్వరగా ఎన్నికలు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే రాబోయే సెప్టెంబర్ నెలలోనే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం , ఎన్నికల సంఘం ఒక పక్కా ప్రణాళికను సిద్ధం చేశాయి. ఎన్నికల నిర్వహణ వ్యూహంలో భాగంగా ప్రభుత్వం ఒక కీలక నిర్ణయానికి వచ్చింది. రాష్ట్రంలో ఒకేసారి కాకుండా విడతలవారీగా ఎన్నికలను జరపాలని భావిస్తోంది. ఇందులో భాగంగా తొలుత పట్టణ ప్రాంతాల్లోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించేందుకు మొగ్గు చూపుతోంది. ఆ తర్వాత గ్రామీణ పరిధిలోకి వెళ్తూ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను పూర్తి చేయాలని ప్రణాళిక రచించింది. ఈ రెండు దశలు ముగిసిన అనంతరం ఆఖరిగా గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు వెళ్లాలనేది ప్రభుత్వ ఆలోచనగా తెలుస్తోంది. జూలై 27వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా 45 రోజుల పాటు సుదీర్ఘంగా డోర్ టూ డో కార్యక్రమాన్ని చేపట్టాలని పార్టీ అధిష్ఠానం క్యాడర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా మున్సిపల్ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తోంది. స్థానిక సమరానికి ముందే పార్టీ నేతల్లో అసంతృప్తిని చల్లార్చేందుకు కూటమి సర్కార్ అడుగులు వేస్తోంది. గత కొన్నాళ్లుగా పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. పదవులు దక్కిన నేతలు మరింత ఉత్సాహంతో క్షేత్రస్థాయిలో పార్టీ విజయానికి కృషి చేస్తారనే నమ్మకంతో ఉన్నారు.

## మహిళను వివస్త్రను చేసి దాడికి పాల్పడిన ఘటన
# మానవత్వానికే మచ్చ

(మొదటి పేజీ తరువాయి)

చెప్పడానికి ఇది నిలువెత్తు నిదర్శనమని వైసీపీ అధినేత జగన్ మండిపడ్డారు. ఈ దారుణానికి చంద్రబాబు ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలని ఆయన విమర్శించారు. ఈ ఘటన బుధవారమే జరిగినా, మూడు రోజులపాటు దానిని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారని, చివరకు ఆ వీడియోలు సోషల్ మీడియాలో బయటకు వచ్చి రాష్ట్ర ప్రజలంతా ఈ పరిపాలనను అసహ్యించుకున్న తర్వాతే ప్రభుత్వం స్పందించిందని ఆయన ధ్వజమెత్తారు. ఇప్పుడు తానేదో గొప్పగా చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు హడావుడి చేయడం మరింత సిగ్గుచేటని అన్నారు. ఆ వీడియోలను కప్పిపుచ్చడంపై చూపిన శ్రద్ధను నిందితులను పట్టుకోవడంపై చూపలేదని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తనపై తొలిసారి దాడి జరిగిన వెంటనే బాధితురాలు పోలీసులను ఆశ్రయించినప్పుడు వారు స్పందించి ఉంటే, ఆ తర్వాత ఇంతటి ఘోరం జరిగేది కాదు కదా అని ప్రశ్నించారు. ఆమె ఫిర్యాదుపై వెంటనే కేసు నమోదు చేసి, నిందితులను అదుపులోకి తీసుకుని ఉంటే ఈ దారుణం జరిగేదా? అని నిలదీశారు. ఫిర్యాదు చేసిన మహిళకు రక్షణ కల్పించకుండా మౌనం వహించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. "అసలు పోలీస్ స్టేషన్లు ఉన్నది ఎందుకు? బాధితుల ఫిర్యాదులను స్వీకరించడానికా? లేక అధికార పార్టీ నాయకులు ఏం చెబితే అది చేయడానికా? బాధితురాలికి అండగా నిలవకపోగా, పంచాయితీలు చేయడానికి ప్రయత్నిస్తారా? వీడియోలు బయటకు వస్తేనే చట్టం మేల్కొంటుందా? బాధితురాలి ఫిర్యాదుకు విలువ లేదా? నేరం జరుగుతున్నప్పుడు స్పందించకుండా, ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికిన తర్వాత చర్యల పేరుతో నాటకాలు ఆడటం ఏ రకమైన పోలీసింగ్? రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై ఈ చంద్రబాబు ప్రభుత్వం కావాలనే దాడులను ప్రోత్సహించింది. ఆ అరాచకాలను కప్పిపుచ్చడానికి పోలీసు వ్యవస్థను ఒక రాజకీయ ఆయుధంగా మార్చుకుంది. చట్టాన్ని అధికార పార్టీకి చుట్టంగా, ప్రతిపక్షాలపై వేధింపులకు, అక్రమ కేసులకు ఒక సాధనంగా మార్చి రాష్ట్రాన్ని జంగిల్‌రాజ్‌గా దిగజార్చింది" అని ఆయన తీవ్రంగా విమర్శించారు. అధికార పార్టీ నాయకులు ఏం చేసినా పోలీసులు రక్షిస్తారనే ధైర్యం ఈ రెడ్‌బుక్‌పాలనలో గ్రామాలు, వార్డుల స్థాయి వరకూ పాకిందని జగన్ అన్నారు. అందుకే టీడీపీ కూటమికి చెందిన పలువురు నాయకులు దుశ్శాసనుల్లా తయారయ్యారని మండిపడ్డారు. ఎలాంటి దారుణాలు చేసినా, ముఖ్యంగా మహిళలపై దాడి చేసినా, తమను కాపాడటానికి చంద్రబాబు ఉన్నారనే ధైర్యం వారిలో పెరిగిపోయిందని ధ్వజమెత్తారు. ఈ పరిస్థితి రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా చేసిందని జగన్ ఆరోపించారు. అధికార పార్టీ నాయకుల దురాగతాల నుంచి తమను తాము కాపాడుకోవాల్సిన దుస్థితికి మహిళల చేరుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "చంద్రబాబు గారూ, ఇదేనా మీరు చెప్పే మహిళా భద్రత ఇదేనా మీ సుపరిపాలన ఇదేనా మీ పోలీసింగ్? మహిళల ఆగ్రహమే మీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతుంది" అని ఆయన హెచ్చరించారు.

# టార్గెట్లతోనే జనసేన పని

విజయవాడ – సూర్యవాస్తవం



ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను జనసేన పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా ఉన్న పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పటి నుంచే క్షేత్రస్థాయి వ్యూహాలకు పదును పెడుతున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో సాధించిన చారిత్రాత్మక విజయాల జోష్‌ను స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కొనసాగించాలని, జనసేన పోటీ చేసే ప్రతి స్థానంలోనూ ఖచ్చితంగా గెలిచి తీరాల్సిందేనని ఆయన పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ మేరకు జనసేన ముఖ్య నాయకులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లకు పవన్ కళ్యాణ్ పక్కా టార్గెట్లను నిర్దేశిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో ప్రధానంగా ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యూహాలకు గట్టి గండి కొట్టాలని పవన్ కళ్యాణ్ పట్టుదలగా ఉన్నారు. గతంలో అధికార బలాన్ని ఉపయోగించి వైసీపీ ఏకగ్రీవాలు చేసుకున్న దుస్థితి మళ్లీ రాకూడదని, ఎక్కడా ఒక్క స్థానం కూడా వైసీపీ ఏకగ్రీవం కాకుండా పటిష్టమైన నిఘా మరియు వ్యూహాలు అమలు చేయాలని ఆయన ఆదేశించారు. కూటమిలోని మిత్రపక్షాలైన తెలుగుదేశం, బీజేపీలతో సమన్వయం చేసుకుంటూనే, జనసేన బలంగా ఉన్న ప్రాంతాల్లో మేజర్ స్థానిక సంస్థలను కైవసం చేసుకోవడమే ఏకైక లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన పార్టీ క్లీన్ స్వీప్ చేసిన 21 నియోజకవర్గాల్లోని మేజర్ స్థానిక సంస్థలపై పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. తాను అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకున్న ఆ 21 స్థానాల పరిధిలోని మున్సిపాలిటీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో మెజారిటీ స్థానాలను జనసేన ఖాతాలోనే వేయాలని ఆయన పట్టుదలతో ఉన్నారు. గ్రామీణ స్థాయి నుంచి పార్టీ క్యాడర్‌ను యాక్టివ్ చేయడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించి, క్షేత్రస్థాయిలో పార్టీ మూలాలను మరింత బలోపేతం చేయాలని పవన్ కళ్యాణ్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు.

### సేనానికి సెగ

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తన సొంత పార్టీ నేతల నుంచే కొంత అసంతృప్తిని ఎదుర్కొంటున్నారు. పవన్ కళ్యాణ్ నయకత్వాన్ని ఎవరూ కాదనడం లేదు. కానీ పొరుగున ఉన్న తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తో పోల్చి మరోసారి చూపుతూ సోషల్ మీడియాలో వస్తున్న పోస్టింగ్ లు పవన్ ను కొంత ఇబ్బంది పెడుతున్నాయి. తమిళనాడులో మొన్నటి ఎన్నికల్లో విజయ్ గెలిచిన వెంటనే ఒంటరిగా పోటీ చేసి గెలిచాడని, మనం ఎందుకు చేయకూడదని జనసేన క్యాడర్ ప్రశ్నించినట్లు పవన్ కళ్యాణ్ ఒక సమావేశంలో చెప్పారు. అయితే తమిళనాడుకు, ఆంధ్రప్రదేశ్ కు చాలా తేడా ఉందని, తనను విజయ్ పార్టీతో పోల్చవద్దని కూడా పవన్ కళ్యాణ్ పదే పదే చెబుతున్నారుకాగా తమిళనాడు లో విజయ్ సినీ రంగం నుంచి నేరుగా రాజకీయ రంగంలోకి వచ్చారు. అయినా సరే ఏ మాత్రం జంకుబొంకు లేకుండా పాలన చేస్తున్నారు. పాలనలో తన మార్క్‌ను విజయ్ చూపుతున్నాడు. అవినీతికి వ్యతిరేకంగా విజయ్ తీసుకుంటున్న నిర్ణయాలు దేశ వ్యాప్తంగా చర్చకు కారణమయ్యాయి. అలాగే ఆకస్మిక తనిఖీలతో విజయ్ ప్రభుత్వ అధికారుల వెన్నుల్లో వణుకు పుట్టిస్తున్నారు. మద్యం విషయంలోనూ, ఇచ్చిన హామీల అమలు విషయంలోనూ ఎక్కడా విజయ్ నిధులు లేవు అని చెప్పడం లేదు. అలాగే ప్రత్యర్థులపై విరుచుకుపడుతూనే తన లక్ష్యమేంటో ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నారు. అయినా తనకు ఎక్కడా రాజకీయ అనుభవం లేదని ఆయన చెప్పుకోవడం లేదు.. కానీ పవన్ కళ్యాణ్ మాత్రం తరచూ తనకు పాలన అనుభవం తక్కువని, అందుకే తాను పొత్తు పెట్టుకోవాల్సి వస్తుందని చెప్పడాన్ని జనసైనికులే తప్పుపడుతున్నారు. ఒక ముఖ్యమంత్రికి పాలనా అనుభవం అవసరం లేదని, సామాజిక స్పృహ ఉంటే సరిపోతుందని, పాలనపరమైన వ్యవహారాలను ఉన్నతాధికారులు చూసుకుంటారని, అనుభవజ్ఞులైన మంత్రులను పెట్టుకుంటే పాలన చేయడం పెద్ద కష్టమేమీ కాదని, అలాగనుకుంటే ఎవరూ క్రమేపీ ముఖ్యమంత్రి కాలేదని, తొలిసారి నేరుగా ముఖ్యమంత్రి అయి ఎన్నో జనరంజక కార్యక్రమాలన చేపట్టిన విషయాలను ఈ సందర్భంగా కొందరు సోషల్ మీడియాలో గుర్తు చేస్తున్నారు. కానీ అనుభం లేదన్న సాకుతో పదిహేనేళ్లు పొత్తు పెట్టుకుంటామని చెబుతుండటాన్ని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కానీ పవన్ షణ్ముఖ వ్యూహం ఏంటో తెలియదని, అది తెలిసిన తర్వాత తమ గళం విప్పుతామని కొందరు అంటున్నారు.

## యంగ్ ఇండియాస్థాపించి
# ఎందరికో మార్గదర్శకులైన బేడీ దంపతులు

### - బేడీ 88వ జయంతి ఘన నివాళులర్పించినప్రజాసంఘాలు

గుట్టూరు– సూర్య వాస్తవం





యంగ్ ఇండియా ప్రాజెక్ట్ రూపశిల్పి నరేంద్ర సింగ్ బేడీ 88వ జయంతి గుట్టూరులోని యంగ్ ఇండియా ప్రాజెక్ట్ కార్యాలయంలో సోనియా బేడీ ఏర్పాటు చేశారు. తన జీవితాంతం, పేదలు అణగారిన వర్గాల, ముఖ్యంగా రైతులు గ్రామీణ కార్మికుల హక్కులను ఆయన సమర్థించారు. భారత దేశంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రూపొందించడంలో దాని అమలు పరచడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. అనంతపురం జిల్లా పేరెత్తగానే బాహ్య ప్రపంచానికి గుర్తొచ్చేది స్వచ్ఛంధ సేవా సంస్థలు, ఇలాంటి స్వచ్ఛంధ సేవా సంస్థల పుట్టినిల్లు యంగ్ ఇండియా ప్రాజెక్ట్ ని నరేంద్ర సింగ్ బేడీ 55 సంవత్సరాల కిందట సెప్టెంబర్ 12న పెనుకొండ దగ్గర గుట్టూరులో స్థాపించారు. పేరెన్నిక గల స్వచ్ఛంధ సేవా సంస్థల ప్రతినిధులు ఇక్కడ పనిచేసిన వారే. ఆ రోజుల్లో జిల్లా పేరెత్తగానే గుర్తుకొచ్చేది కరువు, క్షామము, పేదరికం. గత ఐదు దశాబ్దాలుగా జిల్లాలో కరువు నివారణ, సుస్థిరత, మానవ హక్కులు, గ్రామీణ జీవన ప్రమాణాలు, విద్య, వైద్యం, నీటి నిల్వలు, ఇంకుడు గుంతలు, వలసల నివారణ, ఇంధన పొదుపు, సాంప్రదాయేతర ఇంధన వనరుల పెంపకం, ఆహారం, సేంద్రియ వ్యవసాయం, సుస్థిర వ్యవసాయం, ఉపాధి కల్పన, జాతీయ ఉపాధి హామీ పథకం కార్యక్రమాల ద్వారా అభివృద్ధి వైపు ఉత్తమ పౌర సమాజమే లక్ష్యంగా యంగ్ ఇండియా ప్రాజెక్ట్ పనితీరు శ్లాఘించతగ్గది. వయోభారంతో యంగ్ ఇండియా ప్రాజెక్ట్ క్రియాశీలక పాత్రను నిలిపివేసింది. నిరుద్యోగంలో పెరుగుదల, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, భారతదేశ కార్మిక మార్కెట్‌లో ఒక ముఖ్యమైన సమస్యను ఎత్తి చూపుతుంది. స్థిరమైన ఉపాధి కనుగొనడంలో యువకులు తరచుగా ప్రత్యేకమైన సవాళ్లను ఎదుర్కొనే వారు, పెరుగుతున్న గ్రామీణ నిరుద్యోగం తో పాటుగా, పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. పట్టణ కేంద్రాలతో పోల్చితే గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశాలు తక్కువ. గ్రామీణ యువత కలిగి ఉన్న నైపుణ్యాలు, అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాల ద్వారా కోరుకునే నైపుణ్యాల మధ్య అసమతుల్యత ఉందని భావించిన నరేంద్ర బేడీ వాటి నిర్మూలనకు తన జీవితాన్ని ధారపోశారు. బేడీతో పాటు తన భార్య సోనియా బేడీ గత అరవై సంవత్సరాలుగా ఈ ప్రాంతానికి ఇతోధిక కృషి చేశారు. ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు, అలాగే అలోవెరా సాగు, డ్రై ల్యాండ్ ఫార్మింగ్ పర్మ కల్చర్ పై అవగాహన తరగతులు నిర్వహించారు. గివ్ టు గైన్ అనేది పరస్పర సహకారం ద్వారా మద్దతు శక్తిని ప్రతిబింబిస్తుందని, వ్యక్తులు, సంస్థలు సమాజాలు ఉదారంగా ఇస్తే, మహిళలకు అవకాశాలు మద్దతు మరింతగా పెరుగుతాయన్న సంకల్పంతో పనిచేస్తున్నారు. ఇవ్వడం అనేది తగ్గింపు కాదు, అది సంకల్ప బద్ధమైన పెంపు. మహిళలు అభివృద్ధి చెందితే, మనమందరం ముందుకు సాగుతాం అని ఎనభై ఎనిమిదేళ్ల వయస్సులో ముందుకు తీసుకెళున్నారు. దానాలు, జ్ఞానం, వనరులు, మౌలిక సదుపాయాలు, గుర్తింపు, వాదన, విద్య, శిక్షణ, మార్గదర్శకత్వం లేదా సమయం ఏ రూపంలో అయినా మహిళల అభివృద్ధికి సహకరించడం మరింత సహకారపూర్వకమైన పరస్పర అనుసంధానమైన ప్రపంచాన్ని నిర్మించడంలో సహాయపడుతుందని అలాగే లింగ సమానత్వాన్ని సాధించడానికి తన వంతు కృషిని అభినందించక తప్పదు. బేడీతో తమ అనుబంధాన్ని పలువురు ప్రజా సంఘాల నాయకులు ప్రొ యం.సురేష్ బాబు, ప్రొ గంగం పల్లి వెంకటశివారెడ్డి, ప్రణయనాథ్ రెడ్డి, బాయినేని నాగేంద్ర ప్రసాద్, టి స్పార్క్ నిర్వాహకులు షేక్ బాబా, ఎన్జీవో అధినేతలు బలరాం, కిష్టప్ప, కృష్ణమూర్తి, బాల్విన్, మైత్రేయ, గణేష్ అయ్యర్, టింబక్టు బబ్లు, మేరీ గుట్టూరు మంజునాథ్, వెంకటేష్ తదితరులు నివాళి అర్పించారు.

# విక్రమ్-1 విజయంపై స్కైరూట్‌కు మోదీ ఫోన్

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడినమోదీ. మీరు భారత్‌ను గర్వపడేలా చేశారు. భారత ఆశయాలను అంతరిక్షంలో నిల బెట్టారు. యువత కలలకు బలమైన పునాది వేశారు అని అన్నారు. భారత యువతపై తనకున్న నమ్మకాన్ని ఈ బృందం నిజం చేసిందని కొనియాడారు. దీనికి పవన్ స్పందిస్తూ. తమ బృందం సగటు వయసు కేవలం 28 ఏళ్లు మాత్రమేనని చెప్పారు. దీనిపై మోదీ మాట్లాడుతూ.. భారత యువతను నమ్మితే అద్భుతాలు చేయగలరని ఈ విజయం మరోసారి నిరూపించిందన్నారు. ఈ చారిత్రక క్షణంలో తాను కూడా భాగం కావాలనే ఉద్దేశంతోనే ఫోన్ చేసినట్లు చెప్పారు. "ఆగమన్" పేరుతో చేపట్టిన ఈ మిషన్ స్కైరూట్ ప్రయాణానికి ఆరంభం మాత్రమేనని, ముందు ఇంకా ఎన్నో విజయాలు సాధించాలని మోదీ ఆకాంక్షించారు. ఈ తొమ్మిది నిమిషాల సంభాషణలో భారత అంతరిక్ష రంగాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లినందుకు బృందాన్ని అభినందించారు. ప్రయోగానికి ముందు ప్రధాని చేతిరాతలో పంపిన "వందేమాతరం" సందేశాన్ని విక్రమ్-1తో పాటు అంతరిక్షంలోకి తీసుకెళ్లినట్లు పవన్ తెలిపారు. దీనిపై స్పందించిన మోదీ. జాతీయ గీతానికి 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా, యువతకు ఎప్పటికీ స్ఫూర్తిగా నిలిచే సందేశం కావడంతోనే ఆ పదాలను రాశానన్నారు. చివరగా ముందుకు సాగండి. మరింత ఎత్తుకు ఎగరండి. నేను మీ వెంటే ఉంటాను అంటూ స్కైరూట్ బృందానికి ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

# ఎండిన చెట్టును తొలగించిన అధికారులు

**- 'సూర్య వాస్తవం' కథనానికి స్పందన....!**
**- సమస్యను వెలుగులోకి తీసుకువచ్చిన సూర్య వాస్తవంకు కృతజ్ఞతలు తెలియజేసిన స్థానికులు**







**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** అనంతపురం పట్టణంలోని స్థానిక రైల్వే స్టేషన్ రోడ్ లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ పక్కనే ఎండిపోయి పడిపోవడానికి సిద్ధంగా ఉన్న చెట్టును జాప్యం చెయ్యకుండా తొలగించాలని సూర్య వాస్తవం దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు సత్వరమే స్పందించారు. దీంతో కళాశాల విద్యార్థులు, బాటసారులు, వాహన చోదకులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను వెలుగులోకి తీసుకువచ్చిన సూర్య వాస్తవం తెలుగు దినపత్రికకు వారు కృతజ్ఞతలు తెలియజేస్తూ, స్పందించిన సంబంధిత అధికారులకు కూడా ధన్యవాదాలు తెలియజేసారు. ప్రజా సమస్యలను వెలికితీసే కథనాలపై సంబంధిత ప్రభుత్వ అధికారులు స్పందించి తగు విచారణ జరిపి తక్షణ చర్యలు తీసుకుంటున్నందుకు సూర్య వాస్తవం దినపత్రిక యాజమాన్యం అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తుంది.

# పేర్నపల్లి - ఎటిబి రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** పేర్నపల్లి - ఎటిబి రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం తాడిపత్రి బైపాస్ దగ్గర పేర్నపల్లి నుంచి ఎటిబి రోడ్డు (అనంతపురం - తాడిపత్రి - భూపాసముద్రం)ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పేర్నపల్లి నుంచి ఎటిబి రోడ్డను హెచ్చుతగ్గులు లేకుండా బాగా చేయాలని, వేగంగా అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి ఆర్.అండ్.బి డిఈ మధుసూదన్, కాంట్రాక్టర్, తదితరులు పాల్గొన్నారు.

# అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి చికిత్సకు సహాయం కోరిన తల్లిదండ్రులు



**అనంతపురం సిటీ - సూర్య వాస్తవం :** అరుదైన " స్పైనల్ మస్క్యులర్ అట్రొఫీ " వ్యాధితో బాధపడుతున్న తమ మూడు నెలల కుమారుడు శ్యామ్ నందన్ వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందించాలని తల్లిదండ్రులు హిందుప్రియ, నవీన్ కుమార్ విజ్ఞప్తి చేశారు. శనివారం అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, పెద్దవడుగూరు మండలం కదరగుట్టపల్లి గ్రామానికి చెందిన తమ కుమారుడికి వైద్యులు ఎస్ఎంఏ వ్యాధి ఉన్నట్లు నిర్ధారించారని తెలిపారు. ఈ వ్యాధికి అవసరమైన చికిత్స కోసం సుమారు రూ.17 కోట్ల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారని చెప్పారు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన తమకు అంత భారీ మొత్తాన్ని సమకూర్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ప్రభుత్వం, దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి తమ బిడ్డ చికిత్సకు ఆర్థిక సహాయం అందించి ప్రాణాలు కాపాడాలని తల్లిదండ్రులు కోరారు.

# త్వరలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేస్తాం

**- టిడ్కో ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తాం: ఎమ్మెల్యే దగ్గుపాటి**
**- అర్బన్ టిడిపి కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం**
**- రెండేళ్లలో 200కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశాం**




**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** అనంతపురం సమీపంలోని ఆలమూరు లేఅవుట్ మరియు టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అర్బన్ టిడిపి కార్యాలయంలో ఆయన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ కాలనీలకు చెందిన ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. ప్రతి ఒక్కరితో ఓపికగా మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపించారు. మరికొన్ని సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 50 సార్లు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.




ఇందులో 1147 అర్జీలు వచ్చాయని.. వీటిలో 90 శాతానికి పైగా పరిష్కారం చూపించినట్లు తెలిపారు. మరికొన్ని వివిధ దశల్లో ఉన్నట్లు వివరించారు. ఎక్కువగా ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన అర్జీలు వస్తున్నాయన్నారు. గత ప్రభుత్వంలో ఒక సెంటు స్థలం ఇచ్చి ఇళ్ల నిర్మాణం చేస్తామని మాటలు చెప్పి మోసం చేశారన్నారు. ఇప్పుడు వాటిని పూర్తి చేసే బాధ్యత తమపై ఉందని.. త్వరలోనే ఆలమూరు లేఔట్ లో 6వేల ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో టిడ్కో ఇళ్లను పూర్తి చేస్తే.. వైసీపీ ప్రభుత్వంలో కేవలం రంగులు మార్చి లబ్ధిదారుల జాబితాలను మార్చుకున్నారు. త్వరలోనే టిడ్కో ఇళ్లను కూడా అర్హులైన లబ్ధిదారులందరికీ ఇస్తామని స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో నగరంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేయలేదన్నారు. కేవలం 350 కోట్ల రూపాయలతో.. అందునా తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో తీసుకొచ్చిన నిధులతో ప్రధాన రహదారి నిర్మించారన్నారు. అది కూడా వంకరటింకరగా నిర్మాణాలు చేపట్టారని విమర్శలు చేశారు. ఈ రెండేళ్లలోనే అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 200 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు వివరించారు. 25 నుంచి 30 ఏళ్లుగా ఉన్న రోడ్లు, డ్రైనేజీల సమస్యలకు పరిష్కారం చూపించినట్లు వివరించారు. వైసిపి ఐదేళ్ల పాలనలో వ్యవస్థల్ని అస్తవ్యస్తం చేసి వెళ్లిపోతే ముఖ్యమంత్రి చంద్రబాబు తన అనుభవంతో కేవలం ఏడాదిలోపే పరిస్థితిని గాడిలో పెట్టారన్నారు. ఇప్పుడు అమరావతి, పోలవరం సహా రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. అనంతపురం జిల్లాలోనే లక్ష కోట్లకు పైగా పరిశ్రమలు తీసుకొచ్చారన్నారు. అమరావతిలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని.. 2029కల్లా అమరావతి ఎలా ఉండబోతుందో ప్రజలు చూస్తారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాంసాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ చంద్రదండ ప్రకాష్ నాయుడు, టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, పలు కార్పొరేషన్ డైరెక్టర్లు రంగాచారి, బొమ్మినేని శివ, కడియాల కొండన్న, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళికాబద్ధమైన కుటుంబం శ్రేయస్కరం

**- డిఎంహెచ్ఓ డా.కట్టా వెంకటేశ్వర్లు**
**- ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవ ముగింపు కార్యక్రమం .**




**అనంతపురం వైద్యం - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం ఉదయం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి డిఎంహెచ్ఓ డా. వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. అలాగే వివిధ శాఖలకు చెందిన అధికారులు వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగ సిబ్బంది, నర్సింగ్ మరియు శ్రీ సత్యసాయి కాలేజీ విద్యార్థులు, పలు స్వచ్ఛంద సేవ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగాడిఎంహెచ్ఓ డా. కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూలై 11వ తేదీన



ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తున్నదని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుటుంబ ఆరోగ్యం, సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 8 రోజులపాటు అవగాహన సదస్సులు సమావేశాలు ర్యాలీలు నిర్వహించడం జరిగిందన్నారు. పిల్లల మధ్య ఎడమ పాటించడానికి స్త్రీ, పురుషులకు అవసరమైన గర్భనిరోధక మాత్రలు చికిత్సలు ఇతర సాధనాలు ఉచితంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, అన్ని ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా లభిస్తాయన్నారు.ప్రకృతి విధానాలు కూడా తోడ్పడతాయని, బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం కూడా ఒక ప్రకృతి ఎడమ విధానంగా ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. . మహిళా సాధికారత సాధించడం, బాల్య వివాహాలు నిరోధించడం, మహిళా స్వయం నిర్ణయ అధికారం తో దేశ ప్రగతి సాధ్యమని వివరిం చారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు క్షేత్ర స్థాయిలో వైద్య ఆరోగ్యశాఖతోపాటు మహిళా శిశు సంక్షేమ శాఖ, పంచాయతీ రాజ్, స్వచ్ఛంద సేవా సంస్థలు మెప్మా, విద్యాశాఖ, స్వయం సహాయక బృందాలు, సమాచార పౌర సంబంధాలు తదితర శాఖల సమన్వయం తో కృషి చేస్తే ఆరోగ్యవంతమైన సంతోషకరమైన కుటుంబాన్ని నిర్మించు కోవడంలో భాగస్వాములు అవుతామన్నారు. సర్వజన ఆస్పత్రి సూపర్డెంట్ డాక్టర్ మల్లేశ్వరి పాల్గొని కుటుంబ ప్రణాళికలో మహిళా పాత్ర ప్రాముఖ్యత వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సాజిదా బేగం, జిల్లా సమాచార మరియుపౌర సంబంధాల అధికారి బాలకొండయ్య, ఆరోగ్య కార్యక్రమాల అధికారులు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ ప్రసన్న భారతి, జాతీయ ఆరోగ్య మిషన్ అధికారి డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ సునీత, జిల్లా మాస్ మీడియా అధికారి ఈ. నాగరాజు, డిప్యూటీ డెమో లక్ష్మీనారాయణ ఆరోగ్య విద్యా అధికారులు గంగాధర్, వేణు, విజయ భాస్కర్, వెంకటేశ్వర,కిరణ్ న్యాయ సలహాదారు ఆషా రాణి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణంలో ఉన్న భవనంలో పాఠశాల నడుపుతున్న శ్రీ చైతన్య పాఠశాల పై చర్యలు తీసుకోవాలి

**- ప్రజా సమస్యల వేదిక లో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకట ప్రసాద్ కి ఏఐఎస్‌బీ వినతి**
**- అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డి పల్లి పృథ్వి**

**అనంతపురం సిటీ - సూర్య వాస్తవం :** శ్రీ చైతన్య విద్యాసంస్థలు నిర్మాణంలో ఉన్న భవనంలో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని శనివారం అనంతపురం అర్బన్ నియోజకవర్గం కార్యాలయంలో ప్రజా సమస్యల వేదిక కార్యక్రమంలో భాగంగా శ్రీ చైతన్య విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని అఖిలభారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డి పల్లి పృథ్వి అనంతపురం అర్బన్ నియోజకవర్గం ఎమ్మెల్యేకి వినతి పత్రం అందజేశారు.. అనంతరం పాపిరెడ్డిపల్లి పృథ్వి మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా ఇష్ట రాజ్యాంగ విద్యాసంస్థలు నిర్వహిస్తున్న శ్రీ చైతన్య విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు..అనంతపురం



అర్బన్ నియోజకవర్గంలో శ్రీ చైతన్య విద్యాసంస్థలు 8 బ్రాంచ్ లు ఉన్నాయి ఏ ఒక్క పాఠశాలలో కూడా శ్రీ చైతన్య విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను విద్యార్థి తల్లిదండ్రులను మానసికంగా ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు ..అంతే కాకుండా అనంతపురం నగరంలో ఉన్న పిస్తా హౌస్ హోటల్ సమీపంలో శ్రీ చైతన్య పాఠశాల భవనం నిర్మా ణంలో ఉన్న ఆ భవనంలో తరగతులు నిర్వహిస్తూ విద్యా ర్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు పేర్కొన్నారు .. భవనం నిర్మాణంలో ఉన్న ఆ భవనానికి విద్యాశాఖ అధి కారులు అనుమతి ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. నిర్మా ణంలో ఉన్న ఆ భవనం పై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేని కోరారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గం లో శ్రీచైతన్య విద్యాసంస్థలు నయా దందా చేస్తూ రాజ్యాంగాన్ని చట్టాన్ని ఖూనీ చేస్తూ విద్యాసంస్థలు నిర్వ హిస్తున్నారని అన్నారు. తక్షణమే శ్రీ చైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసు కోవాలని ఎమ్మెల్యేని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌బి నాయకులు మంజుల విష్ణు, గౌతమ్ కుమార్, ఇంతియాజ్, శాసవాలి పాల్గొన్నారు.

# చెత్తను సంపదగా మార్చడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి

**- ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు**



**రాయదుర్గం - సూర్య వాస్తవం :** చెత్తను సంపదగా మార్చే విధానంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. రాయదుర్గం పట్టణంలోని కాయగూరల మార్కెట్ దగ్గర శనివారం నిర్వహించిన "స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణాంధ్ర" కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, అభివృద్ధితో పాటు పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణా నికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందుకు తొలి ప్రధాన ఇస్తున్నారన్నారు. 1995లో పచ్చదనం పరిశుభ్రత అనే కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారన్నారు. హైదరాబాద్ మహానగరంలో విరివిగా చెట్లు పెంచడం వల్ల వాతావరణ కాలుష్యం తగ్గటంతో పాటు రెండు డిగ్రీల ఉష్ణోగ్రత కూడా తగ్గిందని వివరించారు.



అలాగే రాత్రి వేళల్లో రోడ్లను శుభ్రం చేసే విదేశీ విధానాన్ని తీసుకొచ్చారన్నారు. పచ్చదనం పెంపు, పర్యావరణ పరిశుభ్రతపై ఆయనకున్న నిబద్ధత అలాంటిది అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చెత్తను శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెస్ చేసి తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చే కార్యక్రమాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. రాయదుర్గం పట్టణంలో కూడా ఈ విధానం అమలు అవుతూ ఉందన్నారు. ఎక్కడికక్కడ పేరుకుపోయే వ్యర్థాలను సంపదగా మార్చే విధానంతో పర్యావరణ పరిరక్షణతో పాటు ఆర్థిక ప్రయోజనాలు కూడా చేకూరుతాయ న్నారు. ముఖ్యంగా చెత్త రవాణా ఖర్చులు తగ్గటంతో పాటు ప్రాసెస్ చేసిన చెత్తను వినియోగంలోకి తేవడం వల్ల సంపద సృష్టి జరుగుతుందన్నారు. ప్రతి కుటుంబం తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి స్థానిక సంస్థలకు సహకరించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడం, పచ్చదనాన్ని పెంపొం దించడం ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. "స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణాంధ్ర" లక్ష్య సాధనలో ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించి, చెత్తను సంపదగా మార్చే కార్యక్రమానికి సహకరించాలని ఎమ్మెల్యే కాలవ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి,పద్మశాలి డైరెక్టర్ పోరాళ్ల పురుషోత్తము మాజీ డైరెక్టర్ టశీకసాల హనుమంతు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల వెంకటేశులు,క్లస్టర్ ఇంఛార్జి ఇనాయత్, సెంట్రల్ స్టోర్ చైర్మన్ పూజరి శివ, బంగి శంకర్,ప్రశాంతి సంపత్ కుమారి,బుదురు తిప్పేస్వమి, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

# ఉడేగోళం సెంటర్ వద్ద రోడ్డు ప్రమాదం

**- డ్రైవర్ నిర్లక్ష్యం...**
**- స్కూల్ పిల్లల ఆటోను ఢీకొన్న ప్రచార ఆటో**
**- 8 మంది విద్యార్థులకు గాయాలు**



**రాయదుర్గం - సూర్య వాస్తవం**
రాయదుర్గం పట్టణంలో శనివారం ఉడేగోళం సెంటర్ వద్ద మెట్రో ప్లస్ సూపర్ మార్కెట్ ప్రచార ఆటో నిర్లక్ష్యంగా, వేగంగా నడపడం వల్ల స్కూల్ విద్యార్థులను తీసుకెళ్తున్న ఆటోను సాయంత్రం 4:30 -5 గంటల సమయంలో బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్టోన్ వ్యాలీ మోడల్ స్కూల్, ఇన్ఫాంట్ జీసస్, భావన, గవర్నమెంట్ మరియు ప్రైవేట్ స్కూల్స్ కు చెందిన 8 మంది పాఠశాల విద్యార్థులకు గాయాలయ్యాయి. అందులో ఒక విద్యార్థినీ మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగతా 7 మంది విద్యార్థులు కూడా భయాందోళనకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

**ఏఐవైఎఫ్ - ఎస్ఎఫ్ఐ ఆరోపణ**

ప్రచారం పేరుతో రోడ్లపై వేగంగా, నిర్లక్ష్యంగా ఆటోలు నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగింది. మెట్రో ప్లస్ సూపర్ మార్కెట్ యాజమాన్యం "ఆషాడం ఆఫర్" పేరుతో ఈరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు మైకులు పెట్టుకుని జోరుగా ప్రచారాలు నిర్వహించారు. చట్ట ప్రకారం ఏ సంస్థ అయినా, ఏ పార్టీ అయినా మైకులు పెట్టుకుని ప్రచారం చేయాలంటే ముందుగా ఆన్‌లైన్‌లో రూ. 100 చలానా చెల్లించి ఋూ అనుమతి పొంది, నిర్ణీత సమయాల్లోనే ప్రచారం చేయాలి. కానీ మెట్రో ప్లస్ సూపర్ మార్కెట్ యాజమాన్యం ఎలాంటి అనుమతులు పొందకుండా ఇష్టారీతిన ప్రచారం చేసింది. అందువల్లే ఈరోజు విద్యార్థులు ఆసుపత్రి పాలయ్యారు. ఈ ప్రమాదానికి పూర్తి బాధ్యత మెట్రో ప్లస్ యాజమాన్యమే. గాయపడిన విద్యార్థుల ఆరోగ్య సమస్యలకు, వైద్య ఖర్చులకు పూర్తిగా వారే బాధ్యత వహించాలి.

అంతేకాదు స్కూల్ టైం లో విద్యార్థుల ఆటోలు తిరిగే సమయంలో ప్రచార వాహనాలు రోడ్లపై ఇష్టారీతిన తిరగడాన్ని పోలీసు, ఋూ అధికారులు అడ్డుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనం.

**ఏఐవైఎఫ్ ఎస్ఎఫ్ఐ డిమాండ్లు**

1. గాయపడిన 8 మంది విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి.
2. మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి ఒక్క విద్యార్థినీ తరలించడం జరిగింది.
2. ప్రమాదానికి కారణమైన మెట్రో ప్లస్ సూపర్ మార్కెట్ ప్రచార ఆటో డ్రైవర్ పై, యాజమాన్యం పై ఐపీసీ సెక్షన్ల క్రింద క్రిమినల్ కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలి.
3. అనుమతి లేకుండా ప్రచారం చేసిన మెట్రో ప్లస్ యాజమాన్యంపై భారీ జరిమానా విధించి, వారి ప్రచార వాహనాలను సీజ్ చేయాలి.
4. స్కూల్ టైం ఉదయం 8-10 గంటలు, సాయంత్రం 3-5 గంటల మధ్య పట్టణంలో ప్రచార వాహనాలను పూర్తిగా నిషేధించాలి.
5. రాయదుర్గం పట్టణంలోని అన్ని స్కూల్ ఆటోలకు వెంటనే భద్రతా తనిఖీలు నిర్వహించి, ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ ఉన్న వాటిని మాత్రమే నడపడానికి అనుమతించాలి. స్పీడ్ గవర్నర్ తప్పనిసరి చేయాలి.
6. పోలీస్, ఋూ శాఖ అధికారుల నిర్లక్ష్యంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి.

పిల్లల ప్రాణాలతో చెలగాటమాడిన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోకపోతే ఏఐవైఎఫ్-ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రేపే మెట్రోప్లస్ సూపర్ మార్కెట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా, రాస్తారోకో నిర్వహిస్తామని హెచ్చరిస్తున్నామని అన్నారు. గాయపడిన విద్యార్థులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నామని అన్నారు.

# మద్యం షాపుల్లో అధిక వసూళ్లు

**- ఎక్సైజ్ శాఖ, ప్రభుత్వ వైఫల్యం**
**- గ్రామాల్లో బెల్ట్ షాపులు**
**- మద్యం దోపిడీనీ ఆపండి**

**రాయదుర్గం - సూర్య వాస్తవం :** రాయదుర్గం నియోజకవర్గంలో అధికారిక లైసెన్స్ ఉన్న మద్యం ఌ వైన్ షాపులతో పాటు అక్రమ బెల్ట్ షాపుల్లో కూడా ఎం ఆర్ పి కన్నా విచ్చలవిడిగా అదనపు వసూళ్లు జరుగుతున్నాయి. పట్టణంలో రూ. 10, 20, గ్రామాల్లో ఏకంగా రూ. 40 వరకు దోపిడీ చేస్తున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు కళ్లు మూసుకున్నారు.

**ఆధారాలతో బయటపడిన దోపిడీ:**

1. **రాయదుర్గం పట్టణం:** 18 జూలై 2026 న మ్యాన్షన్ హౌస్ బ్రాందీ బాటిల్ ఎం ఆర్ పి రూ. 210 కాగా, షాపు వారు రూ. 220 వసూలు చేశారు. నావీ యాప్ ద్వారా చెల్లింపు జరిగిన రసీదు సోషల్ మీడియాలో వైరల్ అయింది. ప్రతి బాటిల్‌పై రూ. 10 చొప్పున దోపిడీ చేస్తున్నారు.
2. **హీరేహాల్ మండలం:** కొన్ని రోజుల క్రితం బాటిల్‌పై రూ. 20 అదనంగా వసూలు చేసినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు లేవు.
3. **గ్రామాల్లో బెల్ట్ షాపులు:** అక్రమంగా నడుస్తున్న బెల్ట్ షాపుల్లో ఏకంగా రూ. 40 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు.

**ఎక్సైజ్ శాఖ, ప్రభుత్వ వైఫల్యం:**

కూటమి ప్రభుత్వ హయాంలో ఒక్కో మండలానికి 30-40 మద్యం షాపులు ఇచ్చి, ఒక్కొక్కరి దగ్గర 50 వేల నుండి లక్ష రూపాయల వరకు డిపాజిట్లు, వేలం పాటల పేరుతో వసూలు చేశారు. బెల్ట్ షాపులను అరికడతామని చెప్పి, పైగా వారి నుండి డిపాజిట్లు తీసుకుని ప్రోత్సహించారు. ఆ డబ్బు తిరిగి ఇస్తారా లేదా అనేది ప్రశ్నార్థకంగా ఉంది. ఇంకా దారుణం ఏమిటంటే గుమ్మగట్ట మండలంలోని కొన్ని గ్రామాల్లో స్కూళ్ల దేవాలయాలు పరిసర ప్రాంతాల్లోనే బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు.



యుపీఐ, ఫోన్ పే ద్వారా రసీదులతో సహా దోపిడీ జరుగుతున్నా ఎక్స్చేంజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. దాని వెనుక ఉన్న అంతర్యం ఏమిటో ప్రజలకు చెప్పాలి.నియోజకవర్గంలోని అన్ని వైన్ షాపులు, బెల్ట్ షాపులపై వెంటనే దాడులు నిర్వహించి ఎం ఆర్ పి కన్నా అదనంగా వసూలు చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.

2. అదనంగా వసూలు చేసిన మొత్తాన్ని వినియోగదారులకు తిరిగి ఇప్పించాలి.
3. ప్రతి షాపులో ప్రభుత్వం నిర్ణయించిన ఎం ఆర్ పి లిస్ట్‌ను బహిరంగంగా ప్రదర్శించాలి. ఉల్లంఘించిన వారి లైసెన్సులు రద్దు చేయాలి.
4. స్కూళ్లు, కళాశాలలు, దేవాలయాలకు 500 మీటర్ల పరిధిలో ఉన్న అన్ని మద్యం షాపులు, బెల్ట్ షాపులను వెంటనే మూసివేయాలి.
5. బెల్ట్ షాపుల నిర్వాహకుల నుండి తీసుకున్న డిపాజిట్ల లెక్కలు బహిరంగపరచి, ఆ డబ్బును ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలి.

ప్రజల రక్తాన్ని పీల్చే ఈ దోపిడీని ఆపకపోతే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో తొందరలో రాయదుర్గం ఎక్సైజ్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వినియోగదారులను ఈ దోపిడీ నుండి కాపాడాలి.

# ప్రస్తుత వాతావరణానికి మిల్లెట్స్ పంటలు ఉత్తమమైనవి

**- అగ్రికల్చర్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ సుమతి**



**పామిడి- సూర్య వాస్తవం :** పామిడి మండల పరిధిలోని గజరాంపల్లి గ్రామంలో ఖరీఫ్ పంటలను అగ్రికల్చర్‌రీసెర్చ్ డైరెక్టర్ డా.సుమతి, శాస్త్రవేత్తలు రాధాకుమారి, విజయశంకర్బాబు, నారాయణస్వామి, సంపత్కుమార్లబృందం క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ మార్పులనుతట్టుకునేందుకు తక్కువ నీటితో పండే చిరుధాన్యాలు(మిల్లెట్స్), స్వల్పకాలిక పంటలు ఉత్తమమైన మార్గమని పేర్కొన్నారు. పంట నష్టాన్ని నివారిం చేందుకు శాస్త్రీయ సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో పాటు, అంతర పంటల సాగును లాభసాటిగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు ప్రత్యామ్నాయ పంటలు వేసే రైతులకు అవసరమైనవిత్తనాలను సకాలంలో అందించేందుకు వ్యవసాయ శాఖ పూర్తి సన్నద్ధంగా ఉందని వారు స్పష్టం చేశారు. పంట మారినా.. బీమా వర్తిస్తుంది: జేడీఏ సాల్రెడ్డి బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందిన రైతులందరికీ ఆయా పంటల ఆధారంగా బీమా సౌకర్యం లభిస్తుందనిజిల్లా వ్యవసాయ శాఖ అధికారి (జెబిఏ) తెలిపారు. అయితే, రుణం తీసుకున్న పంటకు బదులుగావాతావరణ పరిస్థితుల వల్ల వేరే ప్రత్యామ్నాయ పంటవేసినప్పటికీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారుపంట మార్పిడి చేసిన రైతులు సెల్ఫ్ డిక్లరేషన్ (స్వయం ధృవీకరణ) పత్రం ద్వారా ఆన్లైన్లో తమ బీమా వివరాలను నమోదు చేసుకోవచ్చు. చిరు ధాన్యాలు, ఉద్యాన హార్టికల్చర్ పంటలు సాగు చేసే రైతులు కూడా ఈ బీమా సదుపాయాన్ని తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# ఉరవకొండ గవిమఠ పీఠాధిపతి జగద్గురు చెన్నబసవ రాజేంద్ర స్వామి ఇకలేరు



**ఉరవకొండ - సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో లక్షలాది మంది భక్తుల ఆరాధ్యదైవంగా పేరొందిన అనంతపురం జిల్లా ఉరవకొండ గవిమఠ సంస్థానం 8వ పీఠాధిపతి పరమపూజ్య జగద్గురు శ్రీశ్రీశ్రీ చెన్నబసవ రాజేంద్ర మహాస్వామి (98) శనివారం తెల్లవారుజామున మరణించారు. కొంతకాలంగా కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి శాఖా మఠంలో విశ్రాంతి తీసుకుంటున్న మహాస్వామీజీ, వయోభారంతో పాటు వచ్చిన అనారోగ్య సమస్యల కారణంగా ఉదయం సుమారు 5.30 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఈ వార్త తెలియగానే మూడు రాష్ట్రాల భక్తులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. కర్ణాటక రాష్ట్రంలోని బెళగావి జిల్లా మర్గాన్ గ్రామానికి చెందిన చెన్నబసవ రాజేంద్ర మహాస్వామి చిన్న వయస్సులోనే సన్యాస దీక్ష స్వీకరించారు. అనంతరం ఆధ్యాత్మిక సేవా మార్గంలో విశేష కృషి చేసి, 1997లో ఉరవకొండ గవిమఠ సంస్థానం 8వ పీఠాధిపతిగా బాధ్యతలు చేపట్టారు.దాదాపు మూడు దశాబ్దాల పాటు పీఠాధిపతిగా కొనసాగిన ఆయన, కులమతాలకు అతీతంగా ఆధ్యాత్మిక విలువలను ప్రచారం చేయడంతో పాటు నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్య, వసతి సౌకర్యాలు కల్పించారు. కరవు ప్రాంతాల్లో నిరంతర అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి వేలాది మంది జీవితాల్లో సేవాభావాన్ని చాటారు. మహాస్వామీజీ పార్థివ దేహాన్ని బళ్లారి నుంచి ఉరవకొండ గవిమఠానికి తరలిస్తున్నారు. భక్తుల ఆఖరి దర్శనార్థం మఠం ఆవరణలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మూడు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజాప్రతినిధులు, వివిధ మఠాల పీఠాధిపతులు తరలివచ్చే అవకాశం ఉండటంతో అనంతపురం జిల్లా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మహాస్వామీజీ అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చట్టరీత్య చర్యలు

**- 'స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛభారత్'లో ఎంపీడీవో ప్రభాకర్**

**పామిడి- సూర్య వాస్తవం :** పామిడి పట్టణంలో స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర భాగంలో ప్రతి 3వ శనివారం నిర్వహించే స్వచ్ఛంద స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నూతన ఎంపీడీవో డి.ప్రభాకర్, డిప్యూటీ ఎంపీడీవో ఆస్వర్థనాయుడు, ఈఓ శివమూర్తిల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం నుంచి సిబ్బందితో శుభ్రత పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా వారు బీసీసీ రోడ్ ఎద్దులపల్లి రోడ్ అంబేద్కర్ సర్కిల్‌లో రోడ్లను పరిశుభ్రత చేశారు చెత్తను పారవేయొద్దు పరిశుభ్రతను చేయచేయకు ప్లాస్టిక్ కవర్లు వద్దు నూలు సంచులు ముద్దు మొక్కలను నాటుదాం చెట్లను పెంచుదాం పర్యావరణాన్ని పెంపొందించుదాం అంటూ నినాదాలతో ఆప్రాంతాలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్లోని కాయకూరల షాపులలో ప్లాస్టిక్ కవర్లు ఉన్నాయేమోనని తనిఖీ చేశారు వినియోగదారునికి కాయకూరలు ప్లాస్టిక్ కవర్లో అందజేస్తే చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి.ప్రభాకర్ డిప్యూటీ ఎంపీడీవో అస్వర్తనాయుడు, ఈవో శివమూర్తి, టిడిపి సీనియర్ నాయకుడు బొల్లు శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి నాగరాజు ఏవోలు హరినాథ్ ఖాజా మహమ్మద్ సచివాలయల సిబ్బంది పంచాయతీ వర్కర్లు, అంగనవాడి వర్కర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



# 72వ జాతీయ అవార్డులు

**72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం**
**'భ్రమయుగం' చిత్రానికి ఉత్తమ నటుడిగా మమ్ముట్టి ఎంపిక**
**'చందు ఛాంపియన్' చిత్రానికి కార్తీక్ ఆర్యన్ కు కూడా ఉత్తమ నటుడు అవార్డు**
**ఉత్తమ తెలుగు చిత్రంగా నిలిచిన 'కమిటీ కుర్రోళ్లు'**
**ఉత్తమ చిత్రంగా 'ఆర్టికల్ 370', ఉత్తమ నటిగా యామీ గౌతమ్**
**'పుష్ప 2', 'కల్కి', 'లక్కీ భాస్కర్' చిత్రాలకు పలు విభాగాల్లో అవార్డులు**




భారతీయ చలనచిత్ర రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం శుక్రవారం న్యూఢిల్లీలో ప్రకటించింది. 2024 సంవత్సరానికి గాను ప్రకటించిన ఈ అవార్డులలో మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి మరోసారి తన నటనతో జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్నారు. 'భ్రమయుగం' చిత్రంలో ప్రదర్శించిన అద్భుత నటనకు గాను ఆయన ఉత్తమ నటుడిగా నిలిచారు. ఆయనతో పాటు 'చందు ఛాంపియన్' చిత్రానికి కార్తీక్ ఆర్యన్ కూడా ఈ పురస్కారాన్ని సంయుక్తంగా గెలుచుకున్నారు. ఉత్తమ నటిగా బాలీవుడ్ భామ యామీ గౌతమ్ (ఆర్టికల్ 370) ఎంపికయ్యారు. అదే సమయంలో, చిన్న సినిమాగా విడుదలై విమర్శకుల ప్రశంసలతో పాటు బాక్సాఫీస్ వద్ద విజయం సాధించిన 'కమిటీ కుర్రోళ్లు' ఉత్తమ తెలుగు చిత్రంగా ఎంపికై తెలుగు సినిమా గౌరవాన్ని ఇనుమడింపజేసింది. ఈ ఏడాది అవార్డులలో కంటెంట్ ఆధారిత చిత్రాలతో పాటు కమర్షియల్ చిత్రాలు కూడా సత్తా చాటాయి. బాలీవుడ్ చిత్రం 'ఆర్టికల్ 370' ఏకంగా మూడు ప్రధాన పురస్కారాలను కైవసం చేసుకుంది. ఈ చిత్రం ఉత్తమ చిత్రంగా నిలవడమే కాకుండా, ఇందులో అద్భుత నటన కనబరిచిన యామీ గౌతమ్‌ను ఉత్తమ నటి పురస్కారం వరించింది. ఇదే చిత్రానికి శశ్వత్ సచ్‌దేవ్ ఉత్తమ సంగీత దర్శకుడిగా ఎంపికయ్యారు.

**ప్రధాన పురస్కారాల విజేతలు:**
ఉత్తమ చిత్రం: ఆర్టికల్ 370
ఉత్తమ నటులు: మమ్ముట్టి (భ్రమయుగం), కార్తీక్ ఆర్యన్ (చందు ఛాంపియన్)
ఉత్తమ నటి: యామీ గౌతమ్ (ఆర్టికల్ 370)
ఉత్తమ దర్శకుడు: రాజ్‌కుమార్ పెరియసామి (అమరన్)
ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రం: కల్కి 2898 ఏడీ

**తెలుగు సినిమాకు అవార్డుల పంట**

ఈసారి జాతీయ అవార్డులలో తెలుగు చిత్ర పరిశ్రమ పలు విభాగాల్లో తనదైన ముద్ర వేసింది. 'కమిటీ కుర్రోళ్లు' ఉత్తమ తెలుగు చిత్రంగా నిలవడమే కాకుండా, ఈ చిత్రానికి పనిచేసిన పి. రవికుమార్‌కు ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్ అవార్డు లభించడం విశేషం. పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలతో విడుదలై విజయం సాధించిన 'కల్కి 2898 ఏడీ' ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా ఎంపికైంది. దీంతో పాటు ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ (నితిన్ జిహానీ చౌదరి) అవార్డును కూడా గెలుచుకుంది. 'పుష్ప 2' చిత్రం కోసం దర్శకుడు సుకుమార్ ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే రచయితగా పురస్కారం అందుకోగా, ఇదే చిత్రానికి దీపాలి నూర్, శీతల్ శర్మ ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్లుగా నిలిచారు. దుల్కర్ సల్మాన్ హీరోగా నటించిన 'లక్కీ భాస్కర్' చిత్రానికి గాను దర్శకుడు వెంకీ అట్లూరి ఉత్తమ సంభాషణల రచయితగా జాతీయ అవార్డును గెలుచుకున్నారు. ఇక '35 ఇది చిన్న కథ కాదు' చిత్రం ఉత్తమ బాలల చిత్రంగా ఎంపికవగా, అందులో నటించిన పలువురు బాల నటులకు కూడా అవార్డులు దక్కాయి.

**ఇతర ముఖ్యమైన అవార్డులు**

తమిళ చిత్రం 'అమరన్' పలు సాంకేతిక విభాగాల్లో అవార్డులను గెలుచుకుంది. ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన రాజ్‌కుమార్ పెరియసామి ఉత్తమ దర్శకుడిగా, జి.వి. ప్రకాష్ కుమార్ ఉత్తమ నేపథ్య సంగీత దర్శకుడిగా, ఆర్. కలైవన్నన్ ఉత్తమ ఎడిటర్‌గా నిలిచారు. 'మహారాజా' చిత్రానికి గాను ఆనందు అరసు ఉత్తమ యాక్షన్ డైరెక్టర్‌గా, సచనా నమిదాస్ ఉత్తమ సహాయ నటిగా ఎంపికయ్యారు.

**ప్రాంతీయ భాషల్లో ఉత్తమ చిత్రాలు:**
**తెలుగు: కమిటీ కుర్రోళ్లు**
**తమిళం: రాయన్**
**హిందీ: శ్రీకాంత్**
**మలయాళం: ఫెమినా ఫాతిమా**
**కన్నడ: మిథ్య**



## జాతీయ అవార్డుల విజేతలకు మెగాస్టార్ చిరంజీవి అభినందనలు

**72వ జాతీయ అవార్డుల విజేతలకు చిరంజీవి అభినందనలు**
**ఉత్తమ తెలుగు చిత్రంగా నిలిచిన 'కమిటీ కుర్రోళ్ళు' టీమ్‌కు ప్రశంసలు**
**నిహారికను చూసి గర్వపడుతున్నానన్న మెగాస్టార్**
**మమ్ముట్టి, సుకుమార్, నాగ్ అశ్విన్‌లను ప్రత్యేకంగా అభినందించిన చిరు**

72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల విజేతలకు మెగాస్టార్ చిరంజీవి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించిన ఆయన, ప్రతి విజేతకు తన శుభాకాంక్షలు అందజేశారు. ముఖ్యంగా, ఉత్తమ తెలుగు చిత్రంగా నిలిచిన 'కమిటీ కుర్రోళ్ళు' చిత్ర బృందాన్ని అభినందిస్తూ, ఆ సినిమా నిర్మాత, తన సోదరుడి కుమార్తె నిహారిక కొణిదెలను చూసి ఎంతో గర్వ పడుతున్నానని చిరంజీవి పేర్కొన్నారు. అలాగే 'పుష్ప 2' చిత్రానికి ఉత్తమ స్క్రీన్‌ప్లే విభాగంలో అవార్డు గెలుచుకున్న సుకుమార్‌కు, 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి గాను ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా ఎంపికైనందుకు దర్శకుడు నాగ్ అశ్విన్, వైజయంతీ మూవీస్ బృందానికి ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. "నాలుగోసారి ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డుకు ఎంపికైన నా ఆప్తమిత్రుడు మమ్ముట్టికి హృదయపూర్వక శుభాకాంక్షలు. ఇది అసాధారణ విజయం" అని చిరంజీవి కొనియాడారు. 'లక్కీ భాస్కర్' చిత్రానికి ఉత్తమ సంభాషణల రచయితగా నిలిచిన వెంకీ అట్లూరిని, '35' చిత్రం ఉత్తమ బాలల చిత్రంగా ఎంపికవడం పట్ల చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. అదే చిత్రంలో తన ప్రతిభకు గాను ఉత్తమ బాలనటుడిగా అవార్డు గెలుచుకున్న అరుణ్ దేవ్‌ను కూడా ఆయన అభినందించారు. వీరితో పాటు దేశవ్యాప్తంగా వివిధ విభాగాల్లో పురస్కారాలు అందుకున్న ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలుపుతూ, భారతీయ సినిమా మరింత ఉన్నత శిఖరాలకు చేరుకుని, తరతరాలకు స్ఫూర్తినివ్వాలని చిరంజీవి ఆకాంక్షించారు.



# మెస్సీని కట్టడి చేయడమా...

# దాదాపు అసాధ్యం: స్పెయిన్ దిగ్గజం ఆండ్రెస్ ఇనియెస్టా

**ఫైనల్లో మెస్సీని ఆపడం దాదాపు అసాధ్యమన్న ఇనియెస్టా**
**ప్రత్యర్థిపై కాకుండా సొంత ఆటతీరుపై దృష్టి పెట్టాలని స్పెయిన్‌కు సూచన**
**భయం వీడి పూర్తి ఆత్మవిశ్వాసంతో ఆడాలని జట్టుకు పిలుపు**
**మెస్సీ ప్రదర్శన అసాధారణమని కొనియాడిన స్పెయిన్ లెజెండ్**
**ఎవరు గోల్ చేసినా పర్వాలేదు, జట్టు ఛాంపియన్‌గా నిలవడమే ముఖ్యమని వ్యాఖ్య**



అర్జెంటీనాతో జరగనున్న ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్ పోరులో స్టార్ ఆటగాడు లియోనెల్ మెస్సీని పూర్తిగా కట్టడి చేయడం దాదాపు అసాధ్యమని స్పెయిన్ ఫుట్‌బాల్ లెజెండ్ ఆండ్రెస్ ఇనియెస్టా అభిప్రాయపడ్డాడు. మెస్సీని నిలువరించే వ్యూహాలపై అతిగా దృష్టి పెట్టే బదులు, తమదైన శైలిలో ఆడి ఆధిపత్యం ప్రదర్శించడంపైనే స్పెయిన్ జట్టు దృష్టి సారించాలని సూచించాడు. ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగి, తమను ఫైనల్ వరకు తీసుకొచ్చిన ఆటతీరునే కొనసాగించాలని హితవు పలికాడు. ఈ టోర్నమెంట్‌లో అద్భుతమైన డిఫెన్స్‌తో ఆకట్టుకున్న స్పెయిన్, ఏడు మ్యాచ్‌లలో కేవలం ఒక్క గోల్ మాత్రమే ఇచ్చి అజేయంగా ఫైనల్ చేరింది. మరోవైపు, డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా ఈ టోర్నీలో అత్యధిక గోల్స్ చేసిన జట్టుగా నిలిచింది. కెప్టెన్ మెస్సీ ఒక్కడే 8 గోల్స్, 4 అసిస్ట్‌లతో జట్టును ముందుండి నడిపిస్తున్నాడు.

ఈ నేపథ్యంలో, 'గోల్.కామ్' ఉటంకించిన ఓ ఇంటర్వ్యూలో ఇనియెస్టా మాట్లాడుతూ, "మెస్సీని పూర్తిగా కట్టడి చేయడం అసాధ్యం. స్పెయిన్ తమ ఆటతో అర్జెంటీనాను ఎంతలా ఇబ్బంది పెట్టగలదు, లభించిన అవకాశాలను ఎంత కచ్చితత్వంతో గోల్స్‌గా మలచగలదు అన్నదే ఇప్పుడు ముఖ్యం" అని ఇనియెస్టా వివరించాడు. 2010 వరల్డ్ కప్ ఫైనల్లో స్పెయిన్‌కు చారిత్రక విజయాన్ని అందించిన గోల్ చేసింది ఇనియెస్టానే కావడం విశేషం. బార్సిలోనా క్లబ్‌లో తన మాజీ సహచరుడైన మెస్సీపై ఇనియెస్టా ప్రశంసల వర్షం కురిపించాడు. కెరీర్‌లో చివరి వరల్డ్ కప్ ఆడుతున్నప్పటికీ, మెస్సీ ఇప్పటికీ అసాధారణ స్థాయిలో రాణిస్తున్నాడని కొనియాడాడు.

"అతడి ఆటను వర్ణించడానికి మాటలు సరిపోవు. ప్రతీ మ్యాచ్‌లో అతడు చూపించే పట్టుదల, నిబద్ధత చూస్తే సెల్యూట్ చేయాల్సిందే" అని అన్నారు. అదే సమయంలో, డిఫెండింగ్ ఛాంపియన్‌తో తలపడుతున్నప్పటికీ స్పెయిన్ ఆటగాళ్లు ఏమాత్రం భయపడకూడదని ఇనియెస్టా సూచించాడు. "భయంతో ఎప్పుడూ ఆడకూడదు. ఈ టోర్నీలో మన జట్టు ప్రదర్శన క్రమంగా మెరుగవుతూ వచ్చింది. ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత ఆత్మవిశ్వాసంతో మీరు ఫైనల్‌లో ఆడబోతున్నారు. ఎవరి పాత్ర ఏంటో ప్రతీ ఒక్కరికీ తెలుసు. ఎవరు ఆడినా, ఏ స్థానంలో ఆడినా అంతా తమ నియంత్రణలోనే ఉందన్న భావన కలిగిస్తున్నారు" అని జట్టు సత్తాపై విశ్వాసం వ్యక్తం చేశారు. సెమీఫైనల్లో ఫ్రాన్స్‌ను 2-0 తేడాతో ఓడించి ఫైనల్‌కు దూసుకొచ్చిన స్పెయిన్, మైకెల్ ఒయార్జాబల్, లామిన్ యమాల్, మైకెల్ మెరినో వంటి ఆటగాళ్లతో పటిష్ఠంగా కనిపిస్తోంది. అర్జెంటీనాకు వరుసగా రెండోసారి కప్ దక్కకుండా చేసి, 2010 తర్వాత మళ్లీ ప్రపంచ ఛాంపియన్‌గా నిలవాలని స్పెయిన్ పట్టుదలగా ఉంది.

విన్నింగ్ గోల్ ఎవరు కొడతారన్నది ముఖ్యమా అని అడగ్గా, "గోల్ ఎవరు కొట్టినా నాకు ఫర్వాలేదు. అప్పటిలాగే, ఇప్పుడు కూడా మనం ఛాంపియన్లుగా నిలవడమే ముఖ్యం. విజయాన్ని అందించే గోల్ అయితే చాలు, అది ఎవరు కొట్టారన్నది అనవసరం" అని ఇనియెస్టా స్పష్టం చేశాడు.



## అమెరికా చరిత్రలోనే అత్యంత ఖరీదైన క్రీడా ఈవెంట్

**- ఫిఫా ఫైనల్ టిక్కెట్ల ధరల మోతన్యూజెర్సీలో అర్జెంటీనా, స్పెయిన్ మధ్య జరగనున్న తుదిపోరు సగటు టికెట్ ధర రూ. 10.9 లక్షలు, కనీస ధర రూ. 7.17 లక్షలుమెస్సీ చివరి వరల్డ్ కప్ మ్యాచ్ కావడంతో విపరీతంగా పెరిగిన డిమాండ్**

ఫిఫా వరల్డ్ కప్ 2026 ఫైనల్ మ్యాచ్ అమెరికా క్రీడా చరిత్రలోనే సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. న్యూజెర్సీలోని మెట్‌లైఫ్ స్టేడియంలో ఆదివారం జరగనున్న ఈ మహా సంగ్రామంలో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా, స్పెయిన్ జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్ టికెట్ ధరలు ప్రస్తుతం ఆకాశాన్నంటుతున్నాయి. రీసేల్ మార్కెట్‌లో సగటు టికెట్ ధర సుమారు 11,327 డాలర్లు (సుమారు రూ. 10,90,625) పలుకుతుండటంతో, అమెరికాలో 'సూపర్ బౌల్' వంటి మెగా ఈవెంట్లను మించి అత్యంత ఖరీదైన క్రీడా వేడుకగా ఇది నిలిచింది. కనీస టికెట్ ధర కూడా దాదాపు 7,451 డాలర్లు (సుమారు రూ. 7,17,423)గా ఉంది. ఇది అమెరికాలోని సగటు నెలవారీ గృహ ఆదాయం కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. ప్రీమియం సీట్ల ధరలయితే మరింత భారీగా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న విపరీతమైన డిమాండు ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణం. కాగా, సెమీఫైనల్స్‌లో ఇంగ్లండ్‌పై 2-1 తేడాతో అర్జెంటీనా, ఫ్రాన్స్‌ను 2-0తో ఓడించి స్పెయిన్ ఫైనల్‌కు చేరుకున్నాయి.

ఈ ఫైనల్ మ్యాచ్‌పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. లియోనెల్ మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనా వరుసగా రెండోసారి ప్రపంచ కప్‌ను కైవసం చేసుకుని, 1962లో బ్రెజిల్ నెలకొల్పిన రికార్డును సమం చేయాలని పట్టుదలగా ఉంది. మరోవైపు, అత్యంత పటిష్ఠమైన డిఫెన్స్‌తో ఫైనల్‌కు చేరిన స్పెయిన్ రెండోసారి టైటిల్ గెలవాలని లక్ష్యంగా పెట్టుకుంది. టోర్నీలో అత్యధిక గోల్స్ సాధించిన అర్జెంటీనా అటాకింగ్‌కు, కేవలం ఒక్క గోల్ మాత్రమే ఇచ్చి దుర్భేద్యంగా ఉన్న స్పెయిన్ డిఫెన్స్‌కు మధ్య జరగనున్న ఈ పోరు అత్యంత ఆసక్తికరంగా మారింది. అమెరికా, కెనడా, మెక్సికో దేశాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ 48 జట్ల మెగా టోర్నమెంట్, అమెరికాలో ఫుట్‌బాల్‌కు పెరుగుతున్న ఆదరణకు నిదర్శనంగా నిలుస్తోంది. తన వరల్డ్ కప్ కెరీర్‌లో బహుశా చివరి మ్యాచ్ ఆడుతున్న మెస్సీని ప్రత్యక్షంగా చూడాలనే అభిమానుల ఆతృత కూడా టికెట్ ధరలు ఈ స్థాయిలో పెరగడానికి ప్రధాన కారణమైంది. ఫలితం ఎలా ఉన్నా, ఈ మ్యాచ్ అమెరికా సాకర్ చరిత్రలో ఒక చెరగని ముద్ర వేయడం ఖాయం.

# బేతంచర్లలో మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ ప్లాంట్ ప్రారంభం

## పరిశుభ్రమైన పట్టణాల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి



**బేతంచెర్ల– సూర్య వాస్తవం :**బేతంచర్ల పట్టణాన్ని పరిశుభ్రంగా, పర్యావరణ హితంగా తీర్చిదిద్దే దిశగా మరో కీలక ముందడుగు పడింది బేతంచర్ల నగర పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజా కుమారి గానియా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ప్లాంట్‌ను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రతి పట్టణంలో ఆధునిక వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను ఏర్పాటు చేసి చెత్తను శాస్త్రీయంగా సేకరించడం, వర్గీకరించడం, పునర్వినియోగం చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజారోగ్యాన్ని కూడా కాపాడుతున్నామని పేర్కొన్నారు. మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ ప్లాంట్ ద్వారా తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా శుద్ధి చేసి, పునర్వినియోగానికి అనువైన పదార్థాలను తిరిగి వినియోగంలోకి తీసుకురావడం సాధ్యమవుతుందని తెలిపారు. దీనివల్ల చెత్త డంపింగ్ యార్డులపై భారం తగ్గడంతో పాటు కాలుష్య నియంత్రణకు కూడా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. స్వచ్ఛమైన పరిసరాలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని పేర్కొన్నారు, ప్రతి కుటుంబం ఇంటి వద్దే తడి, పొడి చెత్తను వేరు చేసి నగర పంచాయతీ సిబ్బందికి అందించాలని కోరారు. ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రత కార్యక్రమాలు విజయవంతమవుతాయని, బేతంచర్లను రాష్ట్రంలోనే ఆదర్శ పరిశుభ్ర పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న స్వచ్ఛత కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని, ఆధునిక సాంకేతికతతో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను బలోపేతం చేయడం ద్వారా భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన, పచ్చని ఆంధ్రప్రదేశ్‌ను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛ గ్రామాలే లక్ష్యం...

- పెళ్లకూరులో 'స్వచ్ఛ ఆంధ్ర--స్వచ్ఛ దివస్' నిర్వహణ- ప్రతి నెల మూడో శనివారం గ్రామపంచాయతీల్లో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు
- పరిశుభ్రతను ప్రతి ఇంటి బాధ్యతగా భావించాలని అధికారుల పిలుపు
- ఎమ్మార్వో సీహెచ్ హరికృష్ణ, ఎంపీడీవో డాక్టర్ వేణయ్య పాల్గొని పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగస్వామ్యం




**పెళ్లకూరు–సూర్య వాస్తవం :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛ ఆంధ్ర--స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో భాగంగా తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలంలోని గ్రామపంచాయతీల్లో శనివారం విస్తృతంగా పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, సచివాలయ ఉద్యోగులు, మహిళా సంఘాల సభ్యులు, యువత, గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామాల్లో ప్రధాన రహదారులు, అంతర్గత వీధులు, కాలువలో చెత్తను సేకరించి శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా తహసీల్దార్ (ఎమ్మార్వో) సీహెచ్ హరికృష్ణ మాట్లాడుతూ, పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన 'స్వచ్ఛ ఆంధ్ర--స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి కుటుంబం సహకరించాలని కోరారు. ఎంపీడీవో డాక్టర్ వేణయ్య మాట్లాడుతూ, పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే ఈ కార్యక్రమంలో గ్రామస్థులు స్వచ్ఛందంగా పాల్గొని తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, తడి–పొడి చెత్తను వేర్వేరుగా నిర్వహించే అలవాటును ప్రతి కుటుంబం అలవం చుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, మహిళా సంఘాల సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొని పరిశుభ్రత కార్యక్రమాలను విజయవంతం చేశారు. ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛమైన, ఆరోగ్యవంతమైన గ్రామాల నిర్మాణమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు.

# స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్రలో జిల్లా కలెక్టర్

## -మొక్కలు నాటిన కలెక్టర్ రాజకుమారి గణియా





**నంద్యాల– సూర్య వాస్తవం:**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా మూడవ శనివారం నంద్యాల పట్టణంలోని ఏకలవ్యనగర్ సమీపంలోని హిందూ స్మశాన వాటికలో నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా పాల్గొన్నారు. కలెక్టర్ స్వయంగా పారిశుధ్య పనుల్లో పాల్గొని స్మశాన వాటిక పరిసరాలను పరిశీలించారు. ఆవరణలో పేరుకుపోయిన చెత్తను తొలగించడం, కలుపు మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రపరిచే పనులను పరిశీలించారు. అనంతరం స్మశాన వాటిక ఆవరణలో మొక్కలు నాటారు. పరిసరాల పరిశుభ్రతను కాపాడటంతో పాటు పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ రాజకుమారి గణియా సూచించారు. స్వచ్ఛత కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులు స్వీకరిస్తున్న కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి

- ప్రజా సంక్షేమమే తన ప్రధాన లక్ష్యశీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా



**బేతంచెర్ల –సూర్య వాస్తవం :** స్థానిక మండల పరిధిలో ఆర్ అండ్ బి అతిథి గృహంలో శనివారం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా, ప్రజలు నీటి సరఫరా, రోడ్లు, పింఛన్లు, విద్యుత్, ఆరోగ్య సదుపాయాలు వంటి ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే కు వివరించారు. ఎమ్మెల్యే ప్రతి వినతిని శ్రద్ధగా పరిశీలించి, సంబంధిత శాఖాధికారులతో సమన్వయం చేసి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రజలు ఎప్పుడైనా తమ సమస్యలను తెలియజేయవచ్చని సూచిస్తూ, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫిర్యాదుదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రాధే శ్యామ్ కాలనీలో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

-భూమి పూజ చేసిన ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి



**బేతంచెర్ల – సూర్య వాస్తవం :** బేతంచర్ల పట్టణంలోని రాధే శ్యామ్ స్వచ్ఛంద సంఘం కమిటీ సభ్యులు గత 20 సంవత్సరాలుగా తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను ఎన్నికల ప్రచార సమయంలో కమిటీ సభ్యులు మాజీఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ దృష్టికి తీసుకెళ్లారు ప్రజల కష్టాలను అర్థం చేసుకున్న ఆమె అధికారంలోకి వచ్చిన వెంటనే శాశ్వత తాగునీటి సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చారు. హామీని నెరవేర్చే దిశగా కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు ఈ రోజు తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు సంబంధించిన భూమిపూజ కార్యక్రమాన్ని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా రాధే శ్యామ్ స్వచ్ఛంద సంఘం కమిటీ సభ్యులు మాట్లాడుతూ, 20 సంవత్సరాలుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న తమ సమస్యను గుర్తించి, ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# ఏసీబీ వలలో అవినీతి చేప

- ఆదోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ ఆకస్మిక దాడులు...!
- రైతుల ఫిర్యాదుల నేపథ్యంలో తనిఖీలు.. రికార్డుల పరిశీలన, సిబ్బంది విచారణ





**ఆదోని – సూర్య వాస్తవం :**కర్నూలు జిల్లా ఆదోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో శనివారం సాయంత్రం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. కార్యాలయంలో అవినీతి, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయంటూ రైతుల నుంచి అందిన ఫిర్యాదుల ఆధారంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు విశ్వసనీయ సమాచారం. ఏసీబీ అధికారులు కార్యాలయానికి చేరుకుని పలు కీలక రికార్డులు, రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన దస్త్రాలు, ఇటీవలి లావాదేవీల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని విడివిడిగా ప్రశ్నించి పలు అంశాలపై వివరణలు తీసుకున్నట్లు తెలిసింది. కార్యాలయంలో నిర్వహించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ, సేవల అందజేతలో అనుసరించిన విధానాలపై కూడా అధికారులు ఆరా తీసినట్లు సమాచారం.

### ఫిర్యాదులపై లోతైన విచారణ

భూముల రిజిస్ట్రేషన్లు, వ్యవసాయ భూముల క్రయవిక్రయాలకు సంబంధించిన సేవల విషయంలో కొందరు రైతులు అక్రమ వసూళ్లు, అవినీతి జరుగుతోందంటూ ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. ఫిర్యాదుల నిజానిజాలను నిర్ధారించేందుకు సంబంధిత పత్రాలు, లావాదేవీల వివరాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

### అధికారిక ప్రకటన కోసం ఎదురుచూపు...!

తనిఖీల సందర్భంగా స్వాధీనం చేసుకున్న రికార్డులు, పరిశీలించిన అంశాలపై ఏసీబీ అధికారులు ఇంకా అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. విచారణ పూర్తయిన అనంతరం పూర్తి వివరాలను వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఆకస్మిక దాడులతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, కార్యాలయానికి వచ్చిన ప్రజల్లోనూ ఆసక్తి నెలకొంది. ఏసీబీ అధికారుల అధికారిక ప్రకటన వెలువడిన తర్వాత ఈ దాడుల వెనుక ఉన్న కారణాలు, విచారణలో వెలుగులోకి వచ్చిన అంశాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.